V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..
మంగళవారం
11-06-2024
సంపుటి : 01 సంచిక : 38 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD



2

## అన్ని పార్టీలు కలిసి వస్తే అభివృద్ధి సాధ్యం

- విమర్శలు పక్కన పెట్టి సహకరించండి
- రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా
- కేంద్ర మంత్రి పదవి ఇచ్చినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



2

## నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- సమర్థవంతంగా పని చేస్తా
- ప్రధాని మోడీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

## టిమ్స్ ఆస్పత్రులు భళా!



- ఆ ఆస్పత్రులు అద్భుతంగా రూపు దిద్దుకుంటున్నాయి
- ఈ విషయాన్ని పంచుకోవడానికి సంతోషిస్తున్నా
- మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్

2

### మోడీ తొలి సంతకం రైతుల కోసమే..

భారత ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లోని పీఎం కార్యాలయంలో మూడో దఫా తన విధులను చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ పీఎం కిసాన్ నిధిని విడుదల చేశారు. ఈ మేరకు దస్త్రంపై తొలి సంతకం చేశారు. దీంతో 9.3 కోట్ల మంది రైతులకు రూ.20వేల కోట్ల ఆర్థిక సాయం అందనుంది.



### మోడీ తొలి నిర్ణయం పేదల కోసం..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద దేశంలో కొత్తగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన వారి కోసం మొత్తం 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గత పదేళ్లలో ఈ పథకం కింద నిర్మించిన 4కోట్ల 21లక్షల ఇళ్లకు ప్రాథమిక మౌలిక వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు.



## మోడీ 3.0

# కూర్పు కుదిరింది..

## కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు

**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్రంలో కొలువుదీరిన ఎన్డీఏ సర్కార్ మంత్రులకు శాఖలు కేటాయించింది. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు ఏ ఏ శాఖలు ఇవ్వలన్న అంశాన్ని కొలిక్కి తెచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలకు ఐదు మంత్రి పదవులు దక్కాయి. తెలంగాణ నుంచి గతంలో మంత్రిగా పని చేసిన కిషన్ రెడ్డికి వేరే శాఖను కేటాయించింది. ఆయన ఇది వరకు టూరిజం మరియు సాంస్కృతిక శాఖ మంత్రిగా పనిచేశారు. తాజాగా కిషన్ రెడ్డికి బొగ్గు, గనుల శాఖ దక్కింది. మరోవైపు కేబినెట్ హోదాలో చోటు దక్కించుకున్న మరో ఎంపీ బండి సంజయ్‌కు హోం శాఖ సహాయ మంత్రిగా అవకాశం లభించింది. ఏపీ నుంచి టీడీపీకి రెండు మంత్రి పదవులు ఇవ్వగా.. రామ్మోహన్ నాయుడికి పౌర విమానయాన శాఖను కేటాయించింది. అలాగే గ్రామీణాభివృద్ధి సహాయ శాఖను పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఇచ్చింది. బీజేపీ ఎంపీ శ్రీనివాస వర్మకు ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా పనిచేయనున్నారు.

**కీలక శాఖలు బీజేపీ దగ్గరే**

పలు కీలకమైన శాఖలను బీజేపీ నేతలకే ప్రధాని మోడీ అప్పగించారు. అందులో భాగంగానే పాత మంత్రులకు ఆ పదవులు దక్కాయి. హోం మంత్రిత్వ, రక్షణ శాఖ, వైద్యం, ఆర్థిక వంటి శాఖలను బీజేపీ నేతలకే కేటాయించారు. ఈ కీలకమైన శాఖలలో పాత మంత్రులకు దక్కడం ఆసక్తిరంగా మారింది. వైద్యం, హోం శాఖలు ఎన్డీఏ కూటమి నేతలకు ఇచ్చే అవకాశం ఉందని చర్చ జరిగింది. కానీ అవేవీ ఇతరులకు దక్కలేదు.

**పలువురికి మళ్లీ అవే శాఖలు**

మోడీ 3.0లో పాత మంత్రులకు మళ్లీ అవే శాఖలు ఇచ్చింది. కేంద్ర హోంశాఖను మరోసారి అమిత్ షాకే దక్కింది. అలాగే రక్షణ మంత్రుత్వ శాఖను కూడా మళ్లీ రాజ్ నాథ్ (తరువాయి 2లో)

- కిషన్ రెడ్డికి కొత్త శాఖ
- అమిత్ షాకు మరోసారి కేంద్ర హోంశాఖ
- పలువురికి పాత శాఖలే అప్పగించిన మోడీ
- కీలక శాఖలన్నీ బీజేపీ నేతలకే
- హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్
- పౌర విమానయాన శాఖ రామ్మోహన్‌కు
- గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్
- 35 మంది కేబినెట్, 37 మంది సహాయ మంత్రులుగా ప్రకటన



# నేను, మోడీ, చంద్రబాబు అక్కడే చదువుకున్నాం

## ప్రభుత్వ బడి విలువ నాకు బాగా తెలుసు

- సీఎంలు, మంత్రులు, కేంద్ర మంత్రులు ఆ బడుల్లో చదివినవారే
- 90 శాతం మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే
- గౌట్ పాఠశాలల విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారు
- సింగిల్ టీచర్ బడుల్ని మూసేయడానికి వీల్లేదు
- అందుకే 11 వేల పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీ వేశాం
- ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత
- రవింద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**విశ్వంభర, హైదరాబాద్:**

గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని, ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వం రూ. 80 వేలు ఖర్చు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివి పదో తరగతిలో 10/10 జీపీఎస్ సాధించిన విద్యార్థులకు సీఎం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సోమవారం రవీంద్రభారతిలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వందేమాతరం ఫౌండేషన్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని, స్కూళ్లలో టీచర్లు లేరని విద్యార్థులు రావట్లేదు.. (తరువాయి 3లో)

## రుణమాఫీకి ఏర్పాట్లు చేయండి

- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- రైతుల జాబితాను రెడీ చేయాలని సూచనలు
- కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్తొద్దు
- పంట రుణమాఫీ, ఇతర అంశాలపై సమీక్ష
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

3






2

## అమిత్ షాతో ఈటల భేటీ

- పదవి ఆశించిన ఈటలకు కీలక హామీ!
- అధ్యక్ష పదవి ఖాయమేనా!
- మంత్రి వర్గ విస్తరణలో అవకాశం దక్కేనా?



## బాబు ప్రమాణస్వీకారం.. జగన్ బాధితులకు ఆహ్వానం

- వారి కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు
- మొత్తం 104 బాధిత కుటుంబాలు ఎంపిక

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కేసరపల్లి వేదికగా ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధమవుతోంది. ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 12న ఉదయం 11.27 గంటలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలోనే చంద్రబాబు ప్రమాణస్వీకార (తరువాయి 2లో)

## అంటగడుతుర్రు..

- పత్తి విత్తనాల్లో మాయజాలం
- నష్టపోతున్న రైతాంగం
- ఒకటి బ్రాండెడ్.. రెండు నాన్‌బ్రాండ్..
- పంట సాగును డిసైడ్ చేస్తోన్న డీలర్లు
- రూ.కోట్లలో రైతాంగానికి కుచ్చుటోపీ

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** విత్తనం పెట్టడం మొదలు.. మార్కెట్‌లో పంట దిగుబడి అమ్ముకునేంత వరకు రైతాంగం నిలువు దోపిడీకి గురవుతోంది. నాణ్యమైన విత్తనాలు దొరకడం దగ్గర్నుంచీ.. ఎరువులు, పురుగు మందుల దాకా ఏది అసలో.. ఏదీ నకిలీనో రైతులు తేల్చుకోలేకపోతున్నారు. అధికశాతం మంది పత్తి రైతులు ఫెర్టిలైజర్స్ డీలర్లపైనే ఆధారపడి వారు చెప్పిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తున్నారు. అసలు ఆ మందు పనిచేస్తుందా..? ఆ విత్తనాలు మంచి దిగుబడి వస్తుందా..? అనే దానిపై క్లారిటీ లేక డీలర్లే దిక్కవుతున్నారు. దీంతో డీలర్లు ఏం ఇచ్చినా.. ఎలా ఇచ్చినా.. అదే పరమావధిగా భావిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. కనీసం విత్తన దుకాణానికి వెళ్లిన రైతు తనకేం కావాలో స్వతహాగా అడిగి (తరువాయి 2లో)



విశ్వంభర V3 NEWS లక్ష్యం సమాజహితం



# నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

* సమర్థవంతంగా పని చేస్తా
* ప్రధాని మోడీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

**విశ్వంభర, ఢిల్లీ:** తనపై ప్రధాని నరేంద్ర మోడీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తనకు బొగ్గు, గనుల శాఖ కేటాయించడంపై ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 'బొగ్గు, గనులు దేశానికి ఆదాయం తీసుకువచ్చే శాఖలు. దేశంలో రోజురోజుకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలంటే బొగ్గు చాలా కీలకం. ఈ శాఖపై పూర్తిగా అవగాహన పెంచుకొని సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తా. వంద రోజుల కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# పూలబోకేలు తీసుకురావొద్దు

**విద్యార్థులకు నోట్ బుక్‌లు తిసుకురండి**
**శ్రేయోభిలాషులకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి**

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్ రెడ్డి తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వస్తున్న వారికి కీలక విజ్ఞప్తి చేశారు. నన్ను కలవడానికి వచ్చే మిత్రులు, శ్రేయోభిలాషులందరు దయచేసి పూలబోకేలు, శాలువాలు స్వీట్లు తీసుకురావొద్దు. ఇది నా వినమ్ర పూర్వకమైన అభ్యర్థన. వీటికి బదులుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్‌లు లేదా స్ఫూర్తిదాయకమైన కథల పుస్తకాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా ద్వారా ఈ విజ్ఞప్తిని చేశారు. కిషన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. గ్రేట్ డెసిషన్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా మోడీ 3.0 కేబినెట్లో కిషన్ రెడ్డి మంత్రిగా నిన్న ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలోనూ ఆయన మంత్రిగా సేవలందించారు.

# రేపే చంద్రబాబు ప్రమాణ స్వీకారం హజరుకానున్న ప్రధాని మోడీ

**ప్రధాని షెడ్యూల్ ఖరారు**
**7 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు**



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో రేపు కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయకుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారమహోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరుకానున్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ మేధ టవర్స్ వద్ద సభా స్థలంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీతోపాటు ఇతర అతిథులు హాజరుకావడంతో భద్రతను మరింత పటిష్టంగా చేస్తున్నారు. ఈ మేరకు దాదాపు 7వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోడీ హాజరుకావడంతో కేంద్ర బలగాలు సైతం భద్రతను పర్యవేక్షిస్తున్నాయి.

**ప్రధాని షెడ్యూల్ ఇదే**

కేసరపల్లి వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రధాని పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 8.20 నిమిషాలకు ఢిల్లీ నుంచి ప్రధాని మోడీ బయలుదేరనున్నారు. ఈ మేరకు ఉదయం 10.40 నిమిషాలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా కేసరపల్లి వద్ద జరిగే ప్రమాణ స్వీకారమహోత్సవ ప్రాంగణానికి ప్రధాని చేరుకుంటారు. ఉదయం 11 గంటలను నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.45 నిమిషాలకు ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ పర్యటకు బయలుదేరుతారు.



# బాబు ప్రమాణ స్వీకారానికి అతిథిగా రామ్ చరణ్!

* హాజరుకానున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు

**విశ్వంభర, అమరావతి:** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. అధికార పార్టీ వైఎస్సార్‌సీపిని చిత్తు చేస్తూ ఏకంగా 164 స్థానాల్లో విజయ ఢంకా మోగించింది. తద్వారా ఏపీలో మరోసారి చంద్రన్న ప్రభుత్వం ఏర్పాటు కానుంది. బుధవారం ఉదయం 11 గంటల 27 నిమిషాలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. గన్నవరం ఎయిర్ పోర్టు దగ్గరలో ఉన్న కేసరపల్లి ఐటీ పార్కులో సుమారు 11 ఎకరాలు స్థలంలో బాబు ప్రమాణ స్వీకార మహోత్సవం జరగనుంది. చంద్రబాబుతో పాటు కేబినెట్ మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక ఏపీలో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించిన జనసేన ఎమ్మెల్యేలు కూడా కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. ఇదిలా ఉంటే చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవానికి అంగరంగ వైభవంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సినీ, క్రీడా, రాజకీయ పారిశ్రామిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని తెలుస్తోంది. ఇక టాలీవుడ్ సినిమా పరిశ్రమ రామ్ చరణ్ బాబు ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కాబోతున్నట్లు తెలుస్తోంది.

## బాబు ప్రమాణస్వీకారం..

**(మొదటి పేజీ తరువాయి)** కార్యక్రమానికి జగన్ ప్రభుత్వ బాధితులకు ఆహ్వానం పంపారు. ఆ బాధితుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. మొత్తం 104 కుటుంబాలను ఇందుకు ఎంపిక చేశారు. ఆ కుటుంబాలలో అబ్దుల్ సలాం, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాలు కూడా ఉన్నాయి.

**నేడు కూటమి పార్టీల భేటీ**

చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఆ రోజు రాత్రి తిరుమలలో బస చేస్తారు. తదుపరి రోజు ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వేంకటేశ్వరుడిని దర్శించుకోనున్నారు. ఏపీలోని కూటమి పార్టీలు మంగళవారం సమావేశం అవుతాయి. చంద్రబాబును శాసనసభ పక్ష నేతగా ఎన్నుకోనున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన ప్రక్రియను చేపడతారు. చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

# అన్ని పార్టీలు కలిసి వస్తే అభివృద్ధి సాధ్యం

**విమర్శలు పక్కన పెట్టి సహకరించండి**
**రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా**
**కేంద్ర మంత్రి పదవి ఇచ్చినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**విశ్వంభర, ఢిల్లీ:** ఎన్నికల వరకే రాజకీయాలు అని, ఇప్పుడు దేశ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీజేపీలో ఓ ఆర్డినరీ కార్యకర్తనైన తనను కార్పొరేటర్ స్థాయి నుంచి ఎంపీగా ఇలా ఎన్నో బాధ్యతలలో నిలబెట్టిన కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కరీంనగర్, తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని చెప్పారు. అన్ని పార్టీలు కలిసి వస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. రాజకీయాల కోసం విమర్శలు, ప్రతివిమర్శలు పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి సహకరించకపోవడం వల్లే అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి జరగలేదని అలాంటి తప్పిదాలు ఈసారి జరగకూడదని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధితో పాటు దేశ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని చెప్పారు. తెలంగాణ, ఏపీలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయని అభివృద్ధి కోసం ఈ రెండు రాష్ట్రాల్లోని పార్టీలు కలిసి పని చేస్తేనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. తనకు కేంద్ర మంత్రి పదవి ఇచ్చినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన బండి సంజయ్. తనకు ఏ శాఖను అప్పగించినా విమర్శలకు తావివ్వకుండా పని చేస్తానన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేరుస్తుందన్నారు.

# వైసీపీ పాలనలో నాపై హత్యాయత్నం జరిగింది



**విశ్వంభర, గుంటూరు:** టీడీపీ ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజును గతంలో ఓసారి సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో తనపై హత్యాయత్నం జరిగిందంటూ రఘురామకృష్ణరాజు తాజాగా గుంటూరు పోలీసులను ఆశ్రయించారు. కస్టడీలో తనను అంతమొందించేందుకు ప్రయత్నించారని గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ హత్యాయత్నానికి సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్, ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు, మాజీ సీఎం జగన్, నాటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్ పాల్ బాధ్యులని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి సీఎం జగన్ ను విమర్శిస్తే చంపేస్తానంటూ సునీల్ కుమార్ బెదిరించారని వివరించారు. అంతేకాదు, కస్టడీలో తనకు గాయాలైతే, ఆ గాయాలపై గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ప్రభావతి న్యాయస్థానానికి తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. తన ఫిర్యాదును పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని రఘురామ గుంటూరు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.



# టిమ్స్ ఆస్పత్రులు భళా!

* ఆ ఆస్పత్రులు అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నాయి
* ఈ విషయాన్ని పంచుకోవడానికి సంతోషిస్తున్నా
* మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్

**విశ్వంభర, హైదరాబాద్:** సనత్ నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లలోని ప్రతిపాదిత మూడు కొత్త టిమ్స్ ఆసుపత్రులు అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరం పరిధిలోని సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్‌లలో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను రూ. 2,679 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్‌లలో ప్రతిపాదిత మూడు కొత్త టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు చక్కగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ విషయాన్ని మీతో పంచుకోవడానికి సంతోషిస్తున్నాను. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రులు హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పునర్ నిర్మిస్తుంది. పట్టణ పేదలకు వికేంద్రీకృత వైద్యాన్ని ఈ ఆస్పత్రులు అందిస్తాయని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన షేర్ చేశారు.

# కూర్పు కుదిరింది..

**(మొదటి పేజీ తరువాయి)** సింగ్‌కే కేటాయించింది. ఈ ఇద్దరు బీజేపీ అగ్రనేతలు శాఖల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. గతంలో రోడ్లు, రవాణా శాఖ మంత్రిగా పని చేసిన నితిన్ గడ్కరీకి మరోసారి అదే శాఖను కేటాయించారు. సహాయ మంత్రులుగా హర్ష్ మల్హోత్రా, అజయ్ టమ్టా ఉండనున్నారు. కీలకమైన విదేశాంగ శాఖను మరోసారి జై శంకర్‌కే ప్రధాని మోడీ కేటాయించారు. గతంలో రెండు పర్యాయాలు ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన నిర్మలా సీతారామన్‌కు మళ్లీ అదే శాఖలో పనిచేయనున్నారు. అదే విధంగా అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రదాన్‌తో పాటు మరికొందరికి అవే శాఖలు దక్కాయి.

**కేబినెట్ హోదా దక్కిన 35 మంది మంత్రులు**

రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జగత్ ప్రకాష్ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మల సీతారామన్, జై శంకర్, మనోహర్ లాల్ ఖట్టర్, హెచ్.డీ. కుమారస్వామి, పియూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జితిన్ రాం మాంజీ, రాజీవ్ రంజన్ సింగ్, సర్బానంద్ సోనేవాల్, డాక్టర్ వీరేంద్ర కుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రహ్లాద్ జోషి, జ్యుయల్ ఓరమ్, గిరిరాజ్ సింగ్, అశ్వనీ వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, భూపేంద్ర యాదవ్, గజేంద్ర సింగ్ షెకావత్, శ్రీమతి అన్నపూర్ణ దేవి, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరీ, డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, జి.కిషన్ రెడ్డి, చిరాగ్ పాశ్వాన్, సీఆర్ పాటిల్ సహా మొత్తంగా 30 మంది కేంద్ర మంత్రులుగా అవకాశం కల్పించగా వారికి శాఖలు కేటాయించింది.

| కేంద్ర మంత్రి | శాఖలు |
|---|---|
| రాజ్ నాథ్ సింగ్ | రక్షణ శాఖ |
| అమిత్ షా | హోం, సహకారం |
| నితిన్ గడ్కరీ | రోడ్డు రవాణా, జాతీయ రహదారులు |
| జేపీ నడ్డా | వైద్యం, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువులు |
| శివరాజ్ సింగ్ చౌహాన్ | వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి |
| నిర్మలా సీతారామన్ | ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు |
| ఎస్.జైశంకర్ | విదేశీ వ్యవహారాలు |
| మనోహర్ లాల్ ఖట్టర్ | గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి |
| హెచ్‌డీ కుమార స్వామి | భారీ పరిశ్రమలు, స్టీల్ |
| పియూష్ గోయల్ | వాణిజ్యం, పరిశ్రమలు |
| ధర్మేంద్ర ప్రధాన్ | విద్య |
| జితన్ రామ్ మాంఝీ | ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు |
| రాజీవ్ రంజన్ సింగ్ | పంచాయతీరాజ్, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ |
| సర్బానంద సోనోవాల్ | పోర్టులు, షిప్పింగ్, జల రవాణా |
| వీరేంద్ర కుమార్ | సామాజిక న్యాయం, సాధికారత |
| కింజరాపు రామ్మోహన్ నాయుడు | పౌర విమానయాన శాఖ |
| ప్రహ్లాద్ జోషీ | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధనం |
| జుయల్ ఓరమ్ | గిరిజన వ్యవహారాలు |
| గిరిరాజ్ సింగ్ | జౌళి |
| అశ్వనీ వైష్ణవ్ | రైల్వే, సమాచార &ప్రసార, ఎలక్ట్రానిక్స్ & ఐటీ |
| జ్యోతిరాదిత్య సింధియా | టెలికం, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి |
| భూపేందర్ యాదవ్ | పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు |
| గజేందర్ సింగ్ షెకావత్ | సాంస్కృతిక, టూరిజం |
| అన్నపూర్ణా దేవి | మహిళా శిశు సంక్షేమం |
| కిరణ్ రిజుజు | పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాలు |
| హర్దీప్ సింగ్ పూరి | పెట్రోలియం, సహజ వాయువులు |
| మన్సుఖ్ మాండవీయా | కార్మిక, యువజన సర్వీసులు, క్రీడలు |
| జి.కిషన్ రెడ్డి | బొగ్గు, గనులు |
| చిరాగ్ పాశ్వాన్ | ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ |
| సీఆర్ పాటిల్ | జల శక్తి |

| కేంద్ర సహాయ మంత్రి | శాఖలు |
|---|---|
| జితిన్ ప్రసాద | వాణిజ్యం, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ |
| శ్రీపాద యశో నాయక్ | ఇంధనం, న్యూ & రెన్యుబుల్ ఎనర్జీ |
| పంకజ్ చౌదరి | ఆర్థిక శాఖ |
| క్రిషన్ పాల్ | సహకార శాఖ |
| రామ్ దాస్ అథావలే | సామాజిక న్యాయం, సాధికారత |
| రామ్ నాథ్ ఠాకూర్ | వ్యవసాయం, రైతు సంక్షేమం |
| నిత్యానంద రాయ్ | హోం అఫైర్స్ |
| అనుప్రియ పటేల్ | వైద్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువులు |
| వి.సోమన్న | జల శక్తి, రైల్వే |
| పెమ్మసాని చంద్రశేఖర్ | గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ |
| ఎస్పీ సింగ్ భఘేల్ | ఫిషరీస్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ |
| శోభా కరంద్లాజే | సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక, ఉపాధి కల్పన |
| కీర్తివర్ధన్ సింగ్ | పర్యావరణం, అటవీ, పర్యావరణ మార్పు, విదేశీ వ్యవహారాలు |
| బి.ఎల్. వర్మ | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, సామాజిక న్యాయం |
| శంతను ఠాకూర్ | పోర్టులు, షిప్పింగ్, జల రవాణా |
| సురేశ్ గోపీ | పెట్రోలియం, సహజ వాయువులు, టూరిజం |
| డాక్టర్ ఎల్.మురుగన్ | సమాచార, ప్రసారం, పార్లమెంటరీ వ్యవహారాలు |
| అజయ్ తమ్తా | రోడ్డు రవాణా, హైవేస్ |
| బండి సంజయ్ కుమార్ | హోం |
| కమలేశ్ పాశ్వాన్ | గ్రామీణాభివృద్ధి |
| భగీరథ్ చౌదరి | వ్యవసాయం, రైతు సంక్షేమం |
| సతీశ్ చంద్ర దూబె | బొగ్గు, గనులు |
| సంజయ్ సేథ్ | రక్షణ |
| రవ్నీత్ సింగ్ | ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, రైల్వే |
| దుర్గాదాస్ ఉయికె | గిరిజన వ్యవహారాలు |
| రక్షా నిఖిల్ ఖడ్సే | క్రీడలు, యువజన సర్వీసులు |
| సుకంత మజుందార్ | విద్య, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి |
| సావిత్రీ ఠాకూర్ | మహిళా శిశు సంక్షేమం |
| తోఖన్ సాహూ | గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి |
| రాజ్ భూషణ్ చౌదరి | జల శక్తి |
| భూపతిరాజు శ్రీనివాస వర్మ | భారీ పరిశ్రమలు, స్టీల్ |
| హర్ష్ మల్హోత్ర | కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, జాతీయ రహదారులు |
| నిముబెన్ జయంతిభాయ్ బంభానియా | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ |
| మురళీధర్ మొహోల్ | సహకార, పౌర విమానయాన |
| జార్జ్ కురియన్ | మైనారిటీ వ్యవహారాలు, ఫిషరీస్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమలు |
| పబిత్ర మార్గెరిట | విదేశీ వ్యవహారాలు, జౌళి |

# అంటగడుతుర్రు..

**(మొదటి పేజీ తరువాయి)** తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారంటే.. పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**రెండు నాన్‌బ్రాండ్ ప్యాకెట్లు కొంటేనే..**

ప్రస్తుత వానాకాలం సీజను ముమ్మరంగా సాగుతోంది. పత్తి రైతులు విత్తనాల కోసం దుకాణాల ముందు ప్రత్యక్ష్యమవుతున్నారు. అసలే ఏం విత్తనాలు పెట్టాలనే సందిగ్ధంలో నుంచి వారి బయటపడేసేందుకు వ్యవసాయ శాఖ కనీస ప్రయత్నమూ చేయడం లేదు. రైతులు ఏం పంట సాగు చేయాలనే విషయాన్ని సైతం విత్తన కంపెనీల డీలర్లే డిసైడ్ చేస్తుండడం విస్మయాన్ని కల్గిస్తోంది. ఈ క్రమంలోనే పత్తి రైతులకు రెండు నాన్‌బ్రాండ్ కంపెనీల విత్తన ప్యాకెట్లను తీసుకుంటేనే.. ఒక బ్రాండెడ్ విత్తన కంపెనీ ప్యాకెట్‌ను ఇస్తున్నారు. లేని పక్షంలో ఏదో ఒక సాకు చెప్పి విత్తనాల ప్యాకెట్లు ఇవ్వకుండానే తిప్పి పంపుతున్నారు. వాస్తవానికి బ్రాండెడ్ పత్తి విత్తనాల ప్యాకెట్ ఎమ్మార్పీ ధరకు రూ.50 నుంచి రూ.100లోపు మార్జిన్(లాభం) ఇస్తుంది. అదే నాన్‌బ్రాండ్ కంపెనీ ఒక్కో ప్యాకెట్ మీద రూ.250 నుంచి రూ.300 వరకు డీలర్లు లాభం ఇస్తుంది. దీంతో డీలర్లు మాయమాటలు చెప్పి నాన్‌బ్రాండ్ పత్తి విత్తనాల ప్యాకెట్లను బలవంతంగా అంటగడుతున్నారు.

**ఉమ్మడి నల్లగొండలో పంటల సాగు ఇలా..**

తెలంగాణ రాష్ట్రం మొత్తంలో పత్తి పంట సాగు విషయానికొస్తే.. ఉమ్మడి నల్లగొండ జిల్లానే టాప్‌లో నిలుస్తుంది. అయితే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 22,12,632 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. నల్లగొండ జిల్లాలో 11,54,994 ఎకరాల్లో వివిధ పంటలు, అందులో పత్తి 8.10లక్షలు, వరి 3.65లక్షలు, కందులు 35వేల ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. పత్తిపంట సాగుకు 16.2లక్షల విత్తన ప్యా కెట్లు, 91,256 క్వింటాల వరి ధాన్యం విత్తనాలను వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచింది. సూర్యాపేట జిల్లాలో వానాకాలం పంటల సాగు లక్ష్యం 5,97,500 ఎకరాలు, కాగా అందులో సింహభాగం వరి 4,25,527 ఎకరాల్లో, పత్తి 1,39,514, కంది 18,869, జొన్న 299, పెసర 11,484, మొక్కజొన్న 32, కా యగూరల తోటలు 3,562 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. యాదాద్రి జిల్లాలో వానాకాలం పంటలసాగు లక్ష్యం 4,60,138 ఎకరాలు, కాగా అందులో వరి 2లక్షల ఎకరాల్లో, పత్తి 1.95లక్షలు, కంది 46వేలు, జొన్న 2,299, పెసర 1,079, కాయగూరలు 13,575 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు.

**23 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లకు పైగానే..**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 23 లక్షలకు పైగానే పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం కానున్నాయి. ఇందులో బ్రాండెడ్ కంపెనీల విత్తన ప్యాకెట్లను ధర షరా మాములే. కానీ నాన్‌బ్రాండెడ్ విత్తన ప్యాకెట్లతోనే అసలు సమస్య ఏర్పడుతోంది. ఇదిలావుంటే.. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా దాదాపు 11 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. వీటి



పరిధిలో పత్తి గింజలు విత్తేందుకు 23 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం కానున్నాయి. ఇందులో కేవలం 10 లక్షల విత్తన ప్యాకెట్లు మించి కొనుగోలు అయ్యే అవకాశం లేదు. ఎందుకంటే.. నాన్‌బ్రాండ్ కంపెనీ ప్యాకెట్లపై డీలర్లకు ఎక్కువ కమీషన్ ఉండడమే ప్రధాన కారణం. అయితే ఇలాంటి విత్తన ప్యాకెట్లు పెడితే.. దిగుబడి తగ్గే అవకాశం ఉంది. మార్కెట్‌లో ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. రైతు తాను సాగు చేయాలనుకునే విత్తన ప్యాకెట్లను డీలర్లు ఇవ్వకుండా బలవంతగా ఇతర కంపెనీల ప్యాకెట్లు తీసుకునేలా కొర్రీలు పెట్టడం నిజంగా దారుణమే. ఇకనైనా అధికారులు స్పందించి విత్తన ప్యాకెట్ల అమ్మకాలపై దృష్టి సారించాల్సిందే.

# అమిత్ షాతో ఈటల భేటీ

* పదవి ఆశించిన ఈటలకు కీలక హామీ!
* అధ్యక్ష పదవి ఖాయమేనా!
* మంత్రి వర్గ విస్తరణలో అవకాశం దక్కేనా?



**విశ్వంభర, ఢిల్లీ:** బీజేపీ అగ్ర నేత, కేంద్ర మంత్రి అమిత్ షాను మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రిగా ప్రమాణం చేయడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈటల రాజేందర్ను నియమించే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇరువురి భేటీ ప్రాధాన్యత చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి పదవి ఆశించిన ఈటలకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం దక్కడంతో రాష్ట్ర పార్టీలో కూడా బీజేపీ జాతీయ నాయకత్వం కీలక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే కిషన్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. బీజేపీలో ఒకరికి రెండు పదవులు అనేది చాలా తక్కువ సందర్భాల్లోనే ఉంటుందని, కిషన్‌రెడ్డి స్థానంలో పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించవచ్చని తెలుస్తోంది. అంతేకాకుండా కొత్త పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. బండి సంజయ్ ఇప్పటికే జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అలాగే తాజాగా కేంద్రమంత్రి అయిన నేపథ్యంలో ఒక పదవికే పరిమితం చేస్తారని రాష్ట్ర రాజకీయాల్లో సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

## కేబినెట్‌లో మోడీ తొలి నిర్ణయం

ప్రధాని మోడీతో పాటు మరో 72 మంది కేంద్ర మంత్రులుగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో 30 మందికి కేబినెట్ హోదా దక్కింది. కేబినెట్ హోదా దక్కిన 35 మందికి శాఖలను కేటాయిస్తూ బీజేపీ అధిష్టానం అధికారిక ప్రకటన చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నివాసంలో ఆయన అధ్యక్షతన సోమవారం మంత్రి వర్గ సమావేశం జరిగింది. ప్రమాణస్వీకారం తర్వాత తొలిసారిగా సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అదే విధంగా మంత్రులకు శాఖలు కేటాయింపు అంశాన్ని కూడా చర్చించింది. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద దేశంలో కొత్తగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే మంత్రివర్గ సమావేశం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోడీ, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన వారి కోసం మొత్తం 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గత పదేళ్లలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4కోట్ల 21లక్షల ఇళ్ల నిర్మాణం జరిగింది. వాటికి ప్రాథమిక మౌలిక వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు.



## పార్టీ ముఖ్య నేతలతో జగన్ కీలక సమావేశం..

**విశ్వంభర, తాడేపల్లిగూడెం:** వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డిని ఆ పార్టీ ముఖ్య నేతలు కలిశారు. తన క్యాంప్ కార్యాలయంలో ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ కలిశారు. నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలపై, అలాగే పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నేతలతో చర్చించారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన అభ్యర్థులు, పార్టీ ముఖ్య నేతలు.. ఫలితాలు వచ్చాక వరుసగా జగన్‌ను కలుస్తున్నారు. గత 4 రోజుల నుంచి ప్రతిరోజూ కొంతమంది అభ్యర్థులు వచ్చి జగన్ ను కలుస్తున్నారు. ఓటమికి గల కారణాలపై విశ్లేషణ జరుగుతోంది. ఓటమికి దారితీసిన పరిస్థితులు, ఇంతటి దారుణమైన ఫలితాలు ఎందుకు వచ్చాయి? అనేదానిపై విశ్లేషణ చేసుకుంటున్నారు. వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ఘోర పరాజయం చెందడం, భారీ మెజార్టీలతో కూటమి అభ్యర్థులు గెలవడం.. వీటన్నింటికి కారణాలు ఏంటి? అనే అంశంపై జగన్ నుంచి నేతలు తెలుసుకున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులపైనా డిస్కస్ చేశారు. దీనిపై ఇప్పటికే వైసీపీ నేతలు గవర్నర్ ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. జగన్ కూడా ట్వీట్ చేశారు. ఈ దాడులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ఏ విధంగా ఉండాలి అనే దానికి సంబంధించి నేతల మధ్య చర్చ చేపట్టారు. ఒకటి రెండు రోజుల్లో దీనికి సంబంధించిన కార్యాచరణకు వైసీపీ సిద్ధమయ్యే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



# రుణమాఫీకి ఏర్పాట్లు చేయండి

- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- రైతుల జాబితాను రెడీ చేయాలని సూచనలు
- కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్తొద్దు
- పంట రుణమాఫీ, ఇతర అంశాలపై సమీక్ష
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

**విశ్వంభర, హైదరాబాద్:** పంట రుణమాఫీకి విధివిధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీ లోపు రుణమాఫీ చేసి తీరాల్సిందేని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పూర్తి వివరాలు సేకరించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సోమవారం పంట రుణమాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో బ్యాంకర్ల నుంచి రైతుల వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలని సూచించారు. కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా, పీఏసీఎస్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తి స్థాయి వివరాలతో పాటు అవసరమైన అంచనా వ్యయాన్ని రూపొందించాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించి విధివిధానాలను రూపొందించి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15లోగా పంట రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పినట్లు తెలిసింది.

# నేను, మోడీ, చంద్రబాబు అక్కడే చదువుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల్లేరని బడులు మూసి వేస్తున్నారన్నారు. ఇది కోడి ముందా, గుడ్డు ముందా అన్నట్లుగా తయారైందని, ప్రభుత్వం టీచర్లను పెట్టకపోతే.. విద్యార్థులు రారు.. విద్యార్థులు రావడం లేదనే నెపంతో సింగిల్ టీచర్ పాఠశాలలన్నింటినీ మూసివేసే పరిస్థితి కొనసాగిందన్నారు. కొన్ని బడుల్లో విద్యార్థుల కన్నా టీచర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్న పరిస్థితి.. ఇలాంటి పరిస్థితులన్నింటినీ దృష్టిలో ఉంచుకొనే తక్షణమే 11 వేల పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. సింగిల్ టీచర్ బడుల్ని మూసేయడానికి వీల్లేదని, తండాలు, గూడేల్లో, మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ బడులను నిర్వహించడం ద్వారా పేదలు, దళితులు, గిరిజనులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు.

**ప్రభుత్వ బడుల విలువ నాకు తెలుసు**

ఈ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్ని ప్రోత్సహించడం అభినందనీయం. ప్రభుత్వ బడుల్లో టాపర్లను నిజానికి ప్రభుత్వమే సన్మానించాలన్నారు. మట్టిలో మాణిక్యాలుగా రాణించిన విద్యార్థులు ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని ప్రసంశించారు. ఇప్పుడు సర్వీసులో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లలో 90 శాతం మంది ప్రభుత్వ బడుల్లోనే చదివారే అని అన్నారు. చాలా రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, కేంద్ర మంత్రులు సైతం ప్రభుత్వ బడుల్లో చదివినవారే అని అన్నారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ. 80వేలు ఖర్చు పెడుతోందని, ప్రభుత్వం పెట్టే ఖర్చులో అధిక శాతం టీచర్ల వేతనాలకే పోతోందన్నారు. డీఎస్సీ ద్వారా త్వరలో 11 వేలకు పైగా పోస్టులు భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వాటి విలువ బాగా తెలుసన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించామని, మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా వారికే ఇచ్చి నిధులు గ్రీన్ ఛానెల్ ద్వారా విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించామన్నారు.

**ప్రతి విద్యార్థికీ అమ్మఒడే తొలి పాఠశాల**

ప్రతి విద్యార్థికీ అమ్మఒడే తొలి పాఠశాలనని అన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చిన్న చిన్న పిల్లల్ని చేర్పించడం ద్వారా వారిని అమ్మఒడికి దూరం చేస్తున్నారని, దీనివల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య సంబంధ బాంధవ్యాలు బలహీనపడుతున్నాయని ఒక నివేదిక తెలిపిందన్నారు. ఇదో సామాజిక సమస్యగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఒకే సిలబస్‌ను ఏళ్ల తరబడి అమలు చేసేవారు.. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్చలేదన్నారు. ఇకపై విద్యా కమిషన్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సిలబస్ మారుస్తామని, విలువైన సూచనలు ఎవరు చేసినా తప్పక పాటిస్తామని, ఇప్పుడు 10/10 జీపీఎస్ వచ్చిన విద్యార్థులు మళ్లీ ఇంటర్‌లోనూ బాగా రాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, మాజీ ఏజీ ప్రకాశ్ రెడ్డి, టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు**

తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందిస్తూ.. విభజన చట్టం అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధుల విడుదల కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ప్రాజెక్టుల సాధన కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ నుంచి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.



## ఎమ్మెల్యేగా కల్పనా సోరెన్ ప్రమాణస్వీకారం

- ఉప ఎన్నికలో గండేయ్ నియోజకవర్గంలో గెలుపు
- స్పీకర్ రవీంద్రనాథ్ మహథ్ సమక్షంలో ప్రమాణం

**విశ్వంభర, జార్ఖండ్:** మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికలో ఆమె గెలుపొందగా.. సోమవారం ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. స్పీకర్ రవీంద్రనాథ్ మహథో ఆమెతో ప్రమాణం చేయించారు. రాజ్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం చంప సోరెన్, జేఎంఎం నాయకులు పాల్గొన్నారు. గండేయ్ నియోజకవర్గ జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేశారు. దీంతో, ఆస్థానానికి ఉపఎన్నిక జరిగింది. ఇటీవల జరిగిన బైపోల్‌లో బీజేపీ అభ్యర్థి దిలీప్ కుమార్ వర్మపై 27 వేల మెజార్టీతో కల్పన విజయం సాధించారు. కాగా కల్పన అసెంబ్లీలోకి వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం.




## హరీష్‌ను బీజేపీలోకి పంపించాలని కేసీఆర్ ప్లాన్..

- వాటిని కాపాడుకునేందుకు కొత్త గేమ్
- సామా రామ్మోహన్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా రావడంతో కేసీఆర్ మరో కొత్త గేమ్‌కు తెరలేపారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తన అల్లుడు హరీశ్రావును బీజేపీలోకి పంపించేందుకు ప్రయత్నిస్తున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. బిడ్డ, పార్టీ, ఆస్తులను కాపాడుకునేందుకు కేసీఆర్ కుట్రలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దొంగ రాజకీయాలను ప్రజలు గమనించాల్సిన అవసరం ఉన్నదని పిలుపు నిచ్చారు. 'నువ్వు కొట్టినట్లు చేయు, నేను తిట్టినట్లు చేస్తా' అని కేసీఆర్ తన పాత ఎత్తుగడలను మళ్లీ అమలు చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. హరీశ్రావును బీజేపీకి పంపి, తన పార్టీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. పైగా కాంగ్రెస్‌ను డ్యామేజ్ చేసేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారన్నారు. ఏం చేసినా, కాంగ్రెస్‌ను దెబ్బ తీయడం కేసీఆర్ అండ్ పార్టీతో సాధ్యం కాదన్నారు. బీఆర్ఎస్ పూర్తిగా కూకటి వేళ్లతో క్రమంగా దానంతట అదే తొలగిపోతున్నదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశాయన్నారు. బీఆర్ఎస్ తన ఓటు బ్యాంక్‌ను బీజేపీకి వేయించిందన్నారు సామా రామ్మోహన్ రెడ్డి.




## ప్రశాంతంగా టీఎస్ పీజీ ఈసెట్ 2024 ప్రవేశ పరీక్ష

**విశ్వంభర, హైదరాబాద్:** టీఎస్ పీజీఈసెట్ –2024 ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్, వరంగల్‌లో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించారు. ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మ్, ఎం ఆర్క్, గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మ్ డీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఈ పరీక్ష నిర్వహించినట్లు కన్వీనర్ పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన సెషన్‌లో జియో ఇంజినీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మెటిక్స్, ఫార్మసీ కోర్సులకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెషన్‌లో 7,461 మంది అభ్యర్థులకు గానూ 7179 మంది హాజరయ్యారు. 96.22 శాతం మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ వంటి కోర్సులకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెషన్‌కు 5477 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 4898 మంది హాజరయ్యారు. 89.43 శాతం మంది పరీక్ష రాశారు.

## ప్రజాస్వామ్యానికి ఎన్నికలు అనివార్యం..

- ఆర్ఎస్ఎస్‌ను అనవసరంగా రాజకీయాల్లోకి లాగుతున్నారు
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**విశ్వంభర, మహారాష్ట్ర:** ఆర్ఎస్ఎస్‌ను అనవసరంగా రాజకీయాల్లోకి లాగుతున్నారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. మహారాష్ట్రలోని నాగ్ పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హజరైన ఆయన వేదికపై ప్రసంగించారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు అనివార్యమైన ప్రక్రియ. అందులో రెండు పక్షాలు ఉన్నందున పోటీ ఉందని అన్నారు. ఇది పోటీలో ఎవరికి వారు తమను తాము ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తారని, దానిలో నిజాయితీ ఉండాలి కానీ అబద్ధాలు మాట్లాడకూడదని తెలిపారు. దేశాన్ని పాలించడానికి ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపిస్తారని, దానిలో భాగంగానే ఎన్నికలు జరగాలి కానీ యుద్ధంలా జరగకూడదని చెప్పారు. ప్రచారంలో ఇలాంటి విమర్శలు చేయడం వల్ల సమాజంలో చిచ్చుకు దారి తీస్తుందని, చీలికలు వస్తాయని అన్నారు. ఇందులోకి ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు కూడా అనవసరంగా లాగారని, టెక్నాలజీ సాయంతో అసత్యాన్ని ప్రదర్శించారని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అబద్ధాన్ని ప్రచారం చేశారని మండిపడ్డారు. ప్రతిపక్షం అనేది కూడా ఉండాలి. ఒకవైపు వారి అభిప్రాయాలు కూడా వెలుగులోకి రావాలి. పోటీ చేయడంలో గౌరవం ఉండాలి కానీ ఈ ఎన్నికల్లో ఆ గౌరవం కనిపించలేదని అన్నారు. మన దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు అంతం కాలేదు కాబట్టే ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. అలాగే గత 10 ఏళ్లలో చాలా సానుకూల విషయాలు జరిగాయని, అయితే ఇప్పుడు మనం సవాళ్ల నుండి పూర్తిగా విముక్తి పొందామని అనుకోవద్దని మోహన్ భగవత్ అన్నారు.

## వైసీపీ ప్రారంభించిన హింసే ఇంకా కొనసాగుతోంది...

- టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విశ్వంభర, కర్నూలు:** ఎన్నికల ఫలితాల అనంతరం ఏపీలో జరుగుతున్న ఘటనల పట్ల టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ స్పందించారు. రాష్ట్రంలో ఐదేళ్ల కిందట వైసీపీనే హింసకు శ్రీకారం చుట్టిందని, ఆ హింస ఇంకా కొనసాగుతోందని అన్నారు. వైసీపీపై ప్రజాగ్రహం వెల్లువెత్తిందని తెలిపారు. గత ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన ఆ పార్టీని ఈసారి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని తెలిపారు. వారికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదని పట్టాభి పేర్కొన్నారు. నిన్న కర్నూలు జిల్లాలో ఓ టీడీపీ కార్యకర్తను అందరూ చూస్తుండగానే దారుణంగా హత్య చేశారని వెల్లడించారు. ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనప్పటికీ వారు ఇంకా గుణపాఠం నేర్చుకోలేదని పట్టాభి విమర్శించారు. టీడీపీ ఎప్పటికీ హింసను ప్రోత్సహించదని, ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు తమ పార్టీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.





## కంగనా అలా మట్లాడటం తప్పు

- అలా మాట్లాడినందుకే కానిస్టేబుల్ కొట్టింది
- పంజాబ్ సీఎం భగవంత్ మాన్

**విశ్వంభర, పంజాబ్:** కంగనా రనౌత్ గతంలో మాట్లాడిన మాటల నేపథ్యంలో కోపంలోనే సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ ఆమె చెంపపై కొట్టారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. కంగనా రనౌత్‌పై చెంప దెబ్బ ఘటనపై ఆయన మొదటిసారి పెదవి విప్పారు. 'అది (కంగనకు చెంపదెబ్బ) కోపం. ఆమె గతంలో మాట్లాడిన మాటలు ఆ అమ్మాయి (సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్)ని ఆగ్రహానికి గురి చేశాయి. ఇలా జరిగి ఉండాల్సింది కాదు. కంగనా అలా మాట్లాడటం తప్పు. ఒక నటి... పబ్లిక్ ఫిగర్... ఎంపీ అయి ఉండి పంజాబే ఉగ్రవాద రాష్ట్రం అనడం సరికాదు' అని పంజాబ్ సీఎం అన్నారు. జూన్ 6న కంగనా రనౌత్ చండీగఢ్ విమానాశ్రయంలో సెక్యూరిటీ చెక్‌కు వెళ్లినప్పుడు అక్కడున్న సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ ఆమె చెంపపై కొట్టింది. రైతుల పోరాటంలో తన తల్లి పాల్గొందని, అలాంటి పోరాటాన్ని కించపరిచినందుకు కంగనను కొట్టినట్లు కుల్వీందర్ కౌర్ చెప్పారు.



# "బాలకార్మికులకు భరోసా ఇద్దాం.... వారిని ఉన్నత పౌరులుగా ఎదగనిద్దాం"



"నేటి బాలలే రేపటి పౌరులు" అనే నానుడిని నిజం చేస్తూ,ఉత్తమ బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామని అనుకున్న సందర్భంలో ఆ చిన్నారులను బాలకార్మికులాగా మార్చడం విచారకరం.

బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన తీసుకు రావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూన్ 12 ను అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినంగా జరుపు కుంటున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఐక్యరాజ్యసమితి ప్రత్యేక విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంను ప్రారంభించింది.

ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే బాల్యం అనేది "బతకడానికి కష్ట పడుతున్న" ఒక జీవితంగా మారింది.ఆనందంగా ఉండాల్సిన బాల్యం బంధించబడి,బానిసలుగా మార్చబడి మధుర స్మృతుల ను కోల్పోయి జీవించడానికి కారణాలు ఎన్నో...ఎన్నెన్నో.బానిసలుగా బతకవలసిరావడం కంటే దురదృష్టం మరోటి ఉండదు. ఆనందంగా గడప వలసిన బాల్యం రకరకాల కారణాలతో బందీఖానలో బతుకీడుస్తున్న సంఘటనలు ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ప్రతి నిముషం ఎక్కడో ఒక చోట సంఘటన జరుగుచూనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 48 మిలియన్లకు పైగా అభాగ్య ప్రజలు మరియు 150 మిలియన్ల బాలకార్మికులు బానిసత్వంలో మగ్గుతున్నారని 2022లో జరిగిన సర్వేలో తేలింది. వీరిలో దాదాపు 25 మిలియన్లు శ్రమ దోపిడీకి, 16 మిలియన్లు బలవంతపు వివాహాల,5 మిలయన్లు లైంగిక వేధింపులకు గురై శ్రమ దోపిడీకి గురైతు కష్టాలు అనుభవిస్తున్నారు.

అన్ని వయస్సుల బాల కార్మికులకు నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలకార్మికులను గుర్తించి, వారికి అన్ని వసతులను కల్పించి సంపూర్ణ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం, బాలకార్మిక వ్యవస్థకు అసలు కారణం గుర్తించడం లాంటివి చేయడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశం. పతనమైన ఆర్థిక వ్యవస్థ మరింత మంది చిన్నారులను బాలకార్మికులుగా మార్చే అవకాశం ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్వో) ప్రకటించింది. అంటే మనము తక్షణ చర్యలు చేపట్టకుంటే చిన్నారుల బాల్యం పనుల్లో గడిచిపోయే పరిస్థితి ఉంది.బాల కార్మిక చట్టాలు ఎంతబలంగా ఉన్న, ఆర్థిక ఇబ్బందులు వల్ల పిల్లల నుంచి బాల్యాన్ని,వారి గౌరవాన్ని,వారి శ్రమను దోచుకోకుండా ఉండేలా లేదు. దీనివల్ల పిల్లలశారీరక, మానసిక స్థితి నష్టపోయి మానసిక, శారీరక అభివృద్ధికి ఆటంకం అయ్యేలా ఉంది. పిల్లలను పనుల్లో పెట్టకుండా అడ్డుకునే నిబంధనలు,చట్టాలు చాలా దేశాల్లో ఉన్నప్పటికీ అమలు పరచడంలో విఫలం అవుతున్నాయి.

ఇప్పటివరకు ఎంతో కొంత కట్టడి అనేది ఉండే,కానీ ఆర్థికపరిస్తితి క్షిణించడం తో భాలకార్మికులు పెరిగే అవకాశం ఉందని ఒక సర్వే తెలియచేసింది. చాలా కుటుంబాలు పేదరికంలో పడటంతో బడి మానేసే పిల్లల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, బడి మానేసిన పిల్లలందరూ బాలకార్మికులుగా మారే అవకాశం ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే విషయంగా భావిస్తున్నారు. ప్రస్తుతం 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పదిహేను కోట్ల మంది పిల్లలు బాల కార్మికులుగా ఉండడం ఆందోళన కలిగించే అంశం.వీరిలో ఎక్కువ మంది అనారోగ్యకరమైన పరిస్థితుల్లో మరియు ప్రమాదకర పనులు చేస్తున్నారు.

2025నాటికి బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లోనూ నిర్దేశించుకొని,ఆ దిశగా ప్రపంచ దేశాలు కృషి చేస్తున్నాయని బాలల హక్కులను పర్యవేక్షిస్తున్న సంస్థలు చెబుతున్నాయి.

చాలా మంది బాలకార్మికులు జీతం లేని పనులు చేస్తున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయనంలో బయటపడింది. కరోనావైరస్ వల్ల ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం అవుతున్న కుటుంబాలపై ఆర్థికంగా చాలా ఒత్తిడి ఉండడం వల్ల తమ పిల్లలను గత్యంతరం లేక బాలకార్మికులుగా మార్చుతున్నారు.

ఒక వ్యక్తి భయం, హింస, బలవంతం, మోసం, బెదిరింపులు, అధికార దుర్వినియోగం లాంటి కారణాలకు లొంగి, మనిషిగా వారి శ్రమను గుర్తించక, వారి శ్రమను దోచుకోవడమే బానిసత్వంగా భావించవచ్చు. విశ్వవ్యాప్తంగా పరిశీలిస్తే బానిసత్వంలో బలవంతపు శ్రమ దోపిడి, వెట్టి చాకిరి, బాల కార్మికులు, లైంగిక వేధింపులకు లాంటివి ఎక్కువ దేశాల్లో కనిపిస్తాయి.మరికొన్ని దేశాల్లో పరిశీలిస్తే పిల్లలను బలవంతంగా సాయుధ పోరుకు వాడడం,మహిళలను అమ్ముకోవడం, బలవంతపు వివాహాలు, మానవ అక్రమ రవాణా లాంటివి కనిపిస్తాయి.

ఆర్థిక పరిస్థితి బాగాలేక,కనీసం తినడానికి సరియైన ఆహారం లేక గత్యంతరం లేని పరిస్థితి కొందరిది,బలవంతపు బతుకులు మరి కొందరివి.ప్రతి 1000 మందిలో 5.4 మంది మరియు నలుగురు బాలబాలికల్లో ఒక్కరు బానిసత్వంలో బతుకుతున్నారని, బడుగు,బలహీన బాలికలు మరియు మహిళల్లో అధికులు పడుపు వృత్తిలోకి బలవంతంగా లాగబడి, మరొక దారిలేక ఆ వృత్తిలో అయిష్టంగా కొనసాగుతున్నారని సర్వేలో వెల్లడయ్యాయి.

ప్రత్యేక ప్రణాళికలు ఏర్పరుచుకుంటే తప్ప లక్ష్యాన్ని చేరుకోలేము.2000 నుంచి 2016 మధ్య ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మికుల సంఖ్య 38 శాతం వరకు తగ్గింది. అంటే పనిచేస్తున్న పిల్లల సంఖ్య 9.4 కోట్ల మంది వరకూ తగ్గింది.ఇదే క్రమంలో చర్యలు తీసుకోవడం వల్ల మరో ఐదేండ్లలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించుకో మరికొన్ని సంవత్సరాలలో అభివృద్ధి కనపడవచ్చు.

కుటుంబాలకు ఆసరాగా నిలవడం, చిన్నారులు ఏమిచేస్తున్నారో ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా పరిశీలించడం,ప్రతి గ్రామంలో, పట్టణంలో ప్రతి వీధిలో చున్నారుల జాబితాను ప్రదర్శిస్తూ వారు ఎక్కడ ఉన్నారో గుర్తింప చేయడం,బడి ఈడు పిల్లలు తప్పకుండా బడిలో ఉండేలా చూడడం, ఎవరు కూడా చిన్నారులను పనిలోకి తీసుకోకుండా అవగాహన కల్పించడం, పిల్లలు ఇష్టపడే పరిసరాలను తయారు చేయడం లాంటి వాటిపై శ్రద్ధ పెట్టడం వల్లపిల్లలు కార్మికులుగా మారే అవకాశాన్ని తగ్గించవచ్చు.

ప్రస్తుతం 15 కోట్ల మంది పిల్లలను బాలకార్మిక వ్యవస్థ పీడిస్తోందని గణాంకాలు చెబు తున్నాయి.పనులు చేయడం మాన్పిస్తే పిల్లలు పాఠశాలకు వెళ్తారని దాని వల్ల వారి ఆరోగ్యం బాగుంటుందని అంతేకాక సరియైన పౌష్టికాహారం అందే అవకాశం ఉండి ఆరోగ్యంగా ఉంటారు.అయినప్పటికీ కొందరు ఇటుకబట్టీలలో,బట్టల పరిశ్రమలో కూలీలుగా ఉండడం విచారకరం. చాలా దేశాల్లో బాలకార్మిక వ్యవస్థ ఉండడానికి ముఖ్యకారణంపేదరికమే. ఈ విషయం జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కూడా సర్వేల ద్వారా తేల్చాయి.తల్లిదండ్రుల పేదరికం పిల్లలకు శాపంగా మారి,వారు చదువుకోవల్సిన వయసులో వ్యవసాయంలోనూ, దుకాణాలలో,కర్మాగారాల్లో మరియు ఇతరత్రా పనుల్లో తల్లిదండ్రులకు సాయంగా లేదా కూలికి వెలుచున్నారు.తల్లిదండ్రుల అవగాహనారాహిత్యం, లేదా పేదరికం వారినిల చేసింది. భారత దేశంలోనే కాదు ప్రపంచ మొత్తం మీద బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎన్నో చట్టాలున్నాయి.

ఆసియా దేశాల్లోని చైనాలో 3.3 మిలియన్లు పాకిస్తాన్లో 2.1 మిలియన్లు, బంగ్లాదేశ్లో 1.5 మిలియన్లు, ఉజ్బెకిస్తాన్లో 1.2 మిలియన్లు మరియు ఉత్తర కొరియాలో 1.1 మిలియన్లు బానిసత్వంలో తమ జీవితాల్ని గడుపుచున్నారు. ప్రపంచములో ఉన్న బానిసత్వ జీవుల్లో 58 శాతం ఆసియా దేశాలైన భారత్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ మరియు ఉజ్బెకిస్తాన్ దేశాల్లో ఉన్నారు. ప్రతి 1000మంది భారతీయుల్లో 6.1 మంది బానిసత్వంలో ఉండగా, మొదటి స్థానంలో ఉత్తర కొరియాలో ప్రతి 1000 మందికి 104.6 అతి తక్కువగా జపాన్లో 0.3 మంది బానిసలుగా బతుకుతున్నారు. 167 దేశాల్లో భారతదేశం 53వ స్థానములో ఉన్నప్పటికీ

అధిక బానిసలు (19 మిలియన్లు) గల దేశంగా ఇండియా అగ్రభాగాన ఉన్నది.ఎన్ని ప్రత్యామ్నాయ మార్గాలు చూపిన,ఆర్థికాభివృద్ధి కల్పించిన కుడా బానిసత్వాన్ని అనుకున్నస్తాయిలో తగ్గించలేక పోతున్నాము.

భారత రాజ్యాంగంలోని 24 వ ఆర్టికల్తో పాటు, ద ఫ్యాక్టరీస్ యాక్ట్ ఆఫ్ 1948, ద చైల్డ్ లేబర్ యాక్ట్ 1986, ద జువైనల్ జస్టిస్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్ ఆఫ్ 2000, ద రైట్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రీ అండ్ కంపల్సరీ ఎడ్యుకేషన్ యాక్ట్ ఆఫ్ 2009 వంటి చట్టాలెన్నో ఉన్నాయి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి,ఎదుటి వారికీ అవగాహన కల్పిస్తూ, సమాజంలో మార్పు తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరూ కృషిచేయడం వల్ల కొంత తగ్గించే అవకాశం ఉంది.నేటి బాలల చేతిలో రేపటి దేశభవిష్యత్ ఆధారపడి ఉన్నందున వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన భాద్యత మనందరిది.

పత్రికలు, ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు, సదస్సులు, ప్రదర్శన శాలలు, ప్రముఖులచే అవగాహనలు ఏర్పాటు చేయడంతో బానిసత్వ దరాచారం నేరమనే భావనను కల్పించాలి. గృహ చాకిరి, వెట్టి చాకిరి, బాల కార్మికులను గుర్తించి విడుదల చేసే ప్రయత్నాలు మరియు యజమానులకు శిక్షలు పడేలా శ్రద్ధ వహించాలి. బానిసల సహాయంతో చేసే వ్యాపారాలను ప్రోత్సహించరాదు.మన దేశము లాంటి విశాల దేశములో నిర్మూలన కష్టమైన కూడా అవైపు ప్రయత్నించడం మంచిది.పెద్దల్లో అవగాహన పిల్లల్లో ఆలోచన కలుగచేస్తే తక్కువకాలములోనే బాల్యాన్ని భద్రంగా బందీ ఖాన నుండి బయటకు తీసుకురావచ్చు. కొత్తప్రభుత్వములో ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని ఆశిద్దాం .



గడప రఘుపతిరావు,
రాష్ట్రస్థాయి
ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత.
9963499282

# వానలు పడాలే

దండిగా వానలు పడాలే
ధరణి మురవాలే
వానలు పడాలే
వాగు వంకలు నిండాలే!!

పచ్చని పైరు పంటలు పండాలే
చెరువులు నిండాలే
చేపలు దండిగా ఉండాలే
బావులు నిండాలే
బాగా పంటలు పండాలే!!

కర్షకుని కష్టాలు తీరాలే
కర్షకుడు కడుపు నిండా తినాలే
ధరణిలో దండిగా పంటలు పండాలే
అవనిలో అందరూ మురవాలే!!

పల్లెలు పచ్చగా ఉండాలే
పశువుల గాసం దొరకాలే
బాగా వానలు పడాలే
బంగారు పంటలు పండాలి
వానతో వ్యవసాయం ముందుకు సాగాలి
ధరణిలో జనమంతా సంతోషంగా
ఉండాలే !!




దేవులపల్లి రమేశ్
నంగునూర్, సిద్దిపేట జిల్లా
9963701294.

# దక్షిణాదిపై ఉత్తరాది పార్టీల దండయాత్ర

2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఉత్తరాది ఆధిపత్యాన్ని దేశంలో మరోసారి కొనసాగించాయనడంలో ఎలాంటి సందేహం లేదు ఎందుకంటే బీజేపీకి ఉత్తరాదిలో కొంత వ్యతిరేకత ఏర్పడినప్పటికీ గతంలో కంటే సీట్లు తగ్గినప్పటికీ అధికారాన్ని మాత్రం మూడోసారి దక్కించుకుంది. దేశ చరిత్రలో ఇప్పటివరకు బ్రాహ్మణుడు తొలి ప్రధాని జోహార్ లాల్ నెహ్రూ మాత్రమే మూడోసారి ప్రధానమంత్రి కాగలిగాడు. ఆ రికార్డును బ్రాహ్మణేతరుడు బీసీగా చెప్పుకుంటున్న నరేంద్ర దామోదరదాస్ మోడీ బ్రేక్ చేశారు. నెహ్రూ కాశ్మీర్ బ్రాహ్మణుడు ఉత్తరాది అధిపత్యానికి కేంద్రమైన ఉత్తరప్రదేశ్ నుంచి ప్రధానమంత్రి అయ్యారు. గుజరాత్కు చెందిన నరేంద్ర మోడీ గాంధీ నగర్ను వదులుకొని ఉత్తరాది వాడిగా పేరు తెచ్చుకోవడానికి వారణాసి నుంచి పోటీ చేసి మూడోసారి గెలిచి ముచ్చటగా ఉత్తరాది ప్రధానమంత్రి అనిపించుకున్నారు. అది కాంగ్రెస్ అయినా బీజేపీ అయిన ఉత్తరాది పార్టీలే.. ఈ రెండు పార్టీలు దక్షిణాదిపై దండయాత్ర చేసిన పార్టీలే బలమైన ప్రాంతీయ పార్టీల నేతృత్వంలో కొనసాగుతున్న దక్షిణాది ప్రాంత రాజకీయ పార్టీలను ప్రజలను జాతీయవాదం ముసుగులో బీజేపీ సెక్యులరిజం సామాజిక న్యాయం ముసుగులో కాంగ్రెస్ దక్షిణాదిలోని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అధికారాన్ని సాధించుకోగా కూటమి పేరుతో ఆంధ్రప్రదేశ్లో, సొంతగా ఒడిశాలో బీజేపీ అధికారాన్ని సాధించింది. కేరళలో ఒక్క సీటు సాధించి కమ్యూనిస్టు కోటాను కాంగ్రెస్ కంచుకోటాను బద్దలు కొట్టి ఎంట్రీ ఇచ్చింది. ఇక ద్రవిడ సిద్ధాంత భూమిక కలిగి ఉత్తరాది హిందీ హిందుస్థాన్ హిందూ మతం ఆధిపత్య వ్యతిరేక తమిళనాడులో ఒక్క సీటు సాధించక పోయిన గతం కంటే అత్యధిక ఓట్లు సాధించి దక్షిణాదిలో తన పట్టును నిలుపుకుంది బీజేపీ. ఈ రెండు ఉత్తరాది పార్టీలు ఆ ప్రాంతంలో తమ పట్టును పదులపరుచుకుంటూనే దక్షిణాదిని మరియు ఈశాన్య రాష్ట్రాలను మధ్య భారతదేశాన్ని తమ కబ్జాలో తెచ్చుకోవడానికి అనేక ఎత్తులు జిత్తులు మోసపు మ్యానిఫెస్టోలు, అమలు గాని హామీలు ఇచ్చి దేశ ప్రజలను గత 78 సంవత్సరాలుగా ఏ ఒక్క దేశ సమస్యను శాశ్వతంగా పరిష్కరించకుండా తమ రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న ఉత్తరాది పార్టీలను ఇంకెంతకాలం దక్షిణాది ప్రజలు భరించాలి. దక్షిణాదికి వీరు చేసింది ఏమిటి 1955లో తక్షణ భారతదేశానికి కేంద్రమైన హైదరాబాద్ను దేశ రెండో రాజధానిగా చేయాలని భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిపాదించినప్పటికీ నేటికీ అంశంపై చర్చ లేదు. పూర్తిగా కుటుంబాలకు తమ కులాల ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అవినీతి కూపంలో ఇరుక్కుపోయిన దక్షిణాది ప్రాంతీయ పార్టీలు కానీ కాంగ్రెస్, బీజేపీ ముఖ్య మంత్రులు గాని దక్షిణాది కేంద్ర రాష్ట్ర మంత్రులు గాని పార్లమెంటు సభ్యులు గాని ప్రశ్నించడం లేదు. ఎందుకంటే వీరు ఉత్తరాది పార్టీలకు దాసోమైనారు. దక్షిణాదిలో అతిపెద్ద రాష్ట్రమైన తమిళనాడు ముఖ్యమంత్రి కూడా ఈ అంశంపై మాట్లాడకపోవడం విచారకరం. ఆంధ్రప్రదేశ్ సంబంధించిన విభజన హామీల అమలు కనీసం రాష్ట్ర రాజధాని ఏర్పాటు చట్టంలో లేకపోవడంతో ఒక ముఖ్యమంత్రి అమరావతి అంటుంటే.. గత ముఖ్యమంత్రి మూడు రాజధానులు అంటూ ఆంధ్ర ప్రదేశ్ ను అయోమయంలో నెట్టడానికి గత ఉత్తరాది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కారణం కాదా.. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క విభజన హామీ అమలు కాలేదు, బయ్యారం ఒక ఫ్యాక్టరీ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృష్ణ గోదావరి జలాల పంపిణీ. ఈ శాస్త్ర పరిష్కారము నీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల ఏర్పాటు ఏవి కూడా గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ అమలు చేయలేదు. కర్ణాటకలో ప్రధానమంత్రి కార్యాలయ ఏర్పాటు కానీ, తమిళనాడులో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు గాని దక్షిణాదిలో పెద్ద రాష్ట్రాలుగా ఉన్న ఈ రెండు రాష్ట్రాలను ఏమాత్రం పట్టించుకోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం గత కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణలో బీఆర్ఎస్ను ఆంధ్రప్రదేశ్లో వైఎస్ఆర్సీపీని వాడుకొని వాటిని బలహీనపరిచి వాటిని నామమాత్రంగా చేసింది బీజేపీ. ఒడిశాలో మిత్రపక్షమైన బీజేపీని పూర్తిగా బలహీనపరిచి బీజేపీ సొంత మెజారిటీతో అధికారాన్ని సాధించింది అంటే దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలను అనేక రకాల ప్రలోభాలకు గురిచేసి రాజకీయ కుట్రలు చేసి విభజించు పాలించు నీతిలో అటు బీజేపీ ఇటు కాంగ్రెస్లు పాంతీయ పార్టీల అస్తిత్వమే లేకుండా చేస్తున్నాయి. ఇది భారత ప్రజాస్వామ్య సమైక్య స్ఫూర్తికి విరుద్ధం. జాతీయ పార్టీల పేరుతో జాతీయవాదము సెక్యులరిజం ముసుగులో దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా ఒకే దేశం ఒకే ఎన్నిక ఒకే భాష ఒకే మతం ఆధిపత్యం పునాదిగా అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ ఉత్తరాది బ్రాహ్మణుల ఆధిపత్యం సంపన్న వర్గాల అండతో కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తున్నాయి. వీరి పాలనలో గత 78 సంవత్సరాలుగా దగా పడుతున్న దక్షణాదిని కాపాడేదెవరు దక్షిణాదిపై ఉత్తరాది పార్టీల దండయాత్రను అడ్డుకోకపోతే దక్షిణాది ప్రజల ఆత్మగౌరవం అభివృద్ధి అధికారం అంతమై ఉత్తరాది పార్టీలకు శాశ్వతంగా బానిసలు అయ్యే రోజు 2026 డీలిమిటేషన్ తర్వాత రాబోతున్నది. దేశంలో అతిపెద్ద రాష్ట్రం దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల జనాభాతో సమానమైన 25 కోట్ల జనాభా కలిగి అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ కంటే వెనుకబడిన ఉత్తరప్రదేశ్ను నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని 2013లో అసెంబ్లీ తీర్మానం చేసినా.. ఆనాటి ముఖ్యమంత్రి కుమారి మాయావతి సిఫారసును తిరస్కరించిన కాంగ్రెస్, బీజేపీ ఉత్తరాది పార్టీలు తమ అధికారాన్ని శాశ్వతంగా దేశంలో కొనసాగించడానికి ఉత్తరప్రదేశ్ను విభజించకుండా తెలంగాణ పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం వ్యతిరేకించినప్పటికీ పార్లమెంటు చరిత్రలో మొట్టమొదటిసారిగా తలుపులు మూసేసి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం తెచ్చారు. ఈ ఉత్తరాది పార్టీలు గత పదేండ్లుగా రెండు తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసింది శూన్యం. దక్షిణాది కవులు కళాకారులు మేధావులు ఈ ఉత్తరాది పార్టీల దండయాత్రను అడ్డుకొని దక్షిణాది ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్
మాజీ డిన్ ఫ్యాక్టరీ ఆఫ్ లా ఉస్మానియా



- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్
మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా "ఉస్మానియా &
తెలంగాణ విశ్వ విద్యాలయం,
ఫోన్: 93901 19889

# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జన గణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.

వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణ మన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్చా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం.

తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు.

వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో ఆయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 194546 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.



1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ"ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు.

1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు.

1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లిష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంధికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు.1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు.

పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 201516 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

# చంద్రబాబుకు కొత్త కాన్వాయ్ రెడీ

- వాహనాలకు సేఫ్టీ టెస్టింగ్ పూర్తి
- ఏపీ 9జీ 393 నంబర్ ప్లేట్ కేటాయింపు
- 11 బ్లాక్ అండ్ బ్లాక్ టయోటా ల్యాండ్ క్రూజర్లు
- సిగ్నల్ జామర్ల కోసం 2 వాహనాలు



**విశ్వంభర, తాడేపల్లి:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి కొత్త కాన్వాయ్ రెడీ అయింది. సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధం అవుతున్న ఆయన కోసం అధికారులు కొత్త కాన్వాయ్‌ను సిద్ధం చేశారు. బ్లాక్ అండ్ బ్లాక్ టయోటా ల్యాండ్ క్రూజర్ వాహనాలు చంద్రబాబు కాన్వాయ్‌లో ఉండనున్నాయి. సేఫ్టీ టెస్టింగ్ సైతం పూర్తి చేసుకున్న ఈ వాహనాలపై AP 9G 393 నంబర్ ప్లేట్‌ను కేటాయించినట్లు తెలిసింది. గతంలో సిల్వర్ కవర్ సఫారీ వాహనాలను ఆయన కాన్వాయ్‌లో ఉపయోగించను న్నారు. చంద్రబాబు అంటేనే సఫారీ వాహనాలు అన్న అభిప్రాయం కూడా ఉండేది. అయితే ఈ సారి కూడా తనకు ఇష్టమైన సఫారీ వాహనాలనే చంద్రబాబు తన కాన్వాయ్ లో వినియోగిస్తారని అంతా భావించారు. ఈ సారి బ్లాక్ అండ్ బ్లాక్‌లో కొత్త కాన్వాయ్‌ని ఎంచుకు న్నారు. కాగా కొత్త కాన్వాయ్‌లో 11 టయోటా ల్యాండ్ క్రూజర్ వాహనాలు ఉండనున్నట్లు సమాచారం. 11 వాహనాల్లో.. 2 వాహనాలను సిగ్నల్ జామర్ల కోసం కేటా యించారు. ఆ వాహనాలు AP 9G 393 నంబర్ ప్లేట్‌తో ఉన్నట్లు సమాచారం. తాడేపల్లి ఇంటెలిజెన్స్ ఆఫీసులో ఈ కాన్వాయ్‌ను అధికారులు సిద్ధంగా ఉంచారు. వీటికి సేఫ్టీ టెస్టింగ్ కూడా పూర్తయినట్లు సమాచారం. ఎల్లుండి ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు ఈ కాన్వాయ్ లోనే వెళ్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## చంద్రబాబు నివాసానికి క్యూ కట్టిన మంత్రి పదవుల ఆశావహులు!

**విశ్వంభర, అమరావతి:** టీడీపీ అధినేత చంద్రబాబు రేపు ముఖ్యమంత్రిగా ప్రమా ణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర మంత్రివర్గ సహచరులు కూడా ప్రమాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, మంత్రి పదవుల ఆశావహులు నేడు చంద్రబాబు నివాసానికి క్యూ కట్టారు. కూటమిలోని జనసేన, బీజేపీ పార్టీలను కూడా దృష్టిలో ఉంచుకున్న చంద్రబాబు... మంత్రివర్గ కూర్పుపై తన నివాసంలో సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. తొలిసారి ఎంపీగా గెలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ను కేంద్ర సహాయమంత్రి పదవికి ప్రతిపాదించినట్టుగానే... ఏపీలోనూ పలువురు కొత్తవారికి మంత్రులుగా చాన్స్ ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, కేంద్రమంత్రివ ర్గంలో స్థానం దొరకని జనసేనకు ఏపీ క్యాబినెట్లో సముచిత ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది.



# బొత్స అక్రమాలు బయట పెడుతాం

- టీచర్ల బదిలీ కోసం లక్షల్లో వసూలు
- రూ.65 కోట్ల వసూళ్లకు పాల్పడ్డాడు
- దీనిపై వెంటనే విచారణ జరపాలి
- ఏసీబీకి టీడీపీ నేత వర్ల రామయ్య ఫిర్యాదు

**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో టీచర్ల బదిలీల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అక్రమాలకు పాల్పడ్డా రని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని అధికారు లను కోరారు. ఈ మేరకు ఆయన ఏసీబీకి ఫిర్యాదు చేశారు. టీచర్ల బదిలీ కోసం ఒక్కో టీచర్ వద్ద రూ. 3 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు చేశారని తన ఫిర్యాదులో తెలిపారు. మొత్తంగా రూ.65 కోట్ల వసూళ్లకు బొత్స పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా టీచర్ల బదిలీలు చేశారని అన్నారు. బొత్స హయాంలో జరిగినంత అవినీతి ఎప్పుడూ జరగలేదన్నారు. గత వైసీపీ పాలనలో పని చేసిన మంత్రుల్లో చాలామంది జైలుకి వెళ్తారంటూ వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదని, వైసీపీ నేతల అవినీతి బాగోతం అంతా బయటకు వస్తుందని వర్ల రామయ్య వ్యాఖ్యలు చేశారు.





## వేములవాడ రాజన్న దర్శనానికి 4 గంటల సమయం

**విశ్వంభర, వేములవాడ :** రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ అంతకం తకూ పెరుగుతోంది. ఈరోజు సోమవారం కావడంతో ఉదయాన్నే పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. గంటలు గడుస్తున్న కొద్దీ రద్దీ పెరుగుతోంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భాలయంలో అభిషేకాలు, అన్నపూజల సేవలు రద్దు చేశారు. మొక్కులు చెల్లించుకునే భక్తులకు 4 గంటలు సమయం పడుతోం దని తెలిపారు. ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. మరోవైపు పెద్ద ఎత్తున తరలి వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వేసవి సెలవులు ముగుస్తుండ టంతో భక్తులంతా తమ కుటుంబ సభ్యులతో తరలి వస్తున్నారని వెల్లడించారు. మరోవైపు ఇవాళ సోమవారం కావడంతో భారీగా శివభక్తులు పోటెత్తారని వివ రించారు. భక్తులంతా కోడె మొక్కులు చెల్లించుకుని శివయ్య దర్శనం చేసుకుం టున్నారని ఆలయ అధికారులు చెప్పారు.



## జగన్ వల్లే తాను ఓడిపోయాను

**వైసీపీ మాజీ ఎమ్మెల్యే రక్షణ నిధి**

**విశ్వంభర, తిరువూరు:** మాజీ సీఎం జగన్ వల్లే తాను ఓడిపోయినట్లు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రక్షణ నిధి సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరువూరు నియోజకవర్గంలో కూటమి గెలుపునకు మద్దతుగా తాను ప్రచారం చేసినట్లు తెలిపారు. కాలమే తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయిస్తుందని ఆయన అన్నారు. ప్రతిపక్ష నేతగా, అధికార పార్టీ ఎమ్మెల్యేగా 2 పర్యాయాలు ఉన్నానని.. జగన్ వల్లే తాను ఓడిపోయాన న్నారు. సీఎం హోదాలో తిరువూరు వచ్చి జగన్ ఇచ్చిన హామీలు నీటి మూటలు అయ్యాయని రక్షణ నిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. బటన్ నొక్కుడు తప్ప సీఎంగా రాష్ట్రానికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. వైఎస్ జగన్ వల్లే తిరువూరు నియోజ కవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయానని అన్నారు. 2023 డిసెంబర్ నుంచి వైసీపీ పార్టీకి దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఐ ప్యాక్ టీం, అసమర్థ సలహాదారులను నమ్మి ఆయన నట్టేట మునిగారని అన్నారు.జగన్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, కనీసం ఎప్పుడైనా ఎమ్మెల్యేలను ఎమ్మెల్యేలుగా గుర్తించావా? అంటూ ఆయన ప్రశ్నించారు.



## అనర్హుల పెన్షన్లు తొలగిస్తాం ..

**మంత్రి పొంగులేటి**

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పెన్షన్లకు కత్తెర పడబోతుంది. పాత పెన్షన్ల కోతకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధం అవుతోంది. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన పెన్షన్లు ఎగిరిపోవడం ఖాయం అని తేల్చారు మంత్రి పొంగులేటి. ఇక మంత్రి పొంగులేటి వ్యాఖ్యలతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అవ్వా తాతల గుండెల్లో ఆందోళన నెలకొంది. పెన్షన్లకు పైరవీలు అంటూ వ్యాఖ్యలు జోడించిన మంత్రి పొంగులేటి... ఖమ్మం ప్రజలకే కాదు ఇది తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్తింపు అంటూ హెచ్చరికలు ఇచ్చారు. పెన్షన్ల జారీలో పైరవీలు ఎలా సాధ్యం?? అర్హత లేకుంటే పెన్షన్లు ఎలా సాధ్యం? అంటూ పొంగులేటి పై పెన్షనర్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. పెన్షన్ల కోతలు తప్పవు అంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలతో ఇరకాటంలో రేవంత్ సర్కార్ పడింది.



## తెలంగాణ బీజేపీ ఎంపీలకు తమిళి సై అభినందన

**విశ్వంభర, చెన్నై :** తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీ ఊహించని ఫలితాలను తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు గాను ఎనిమిది స్థానాలలో బిజెపి విజయం ఈ క్రమంలో బిజెపి మెజారిటీ సీట్లు గెలవడంపై తెలంగాణ మాజీ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ స్పందించారు.తెలంగాణలో గెలుపొందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను మాజీ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఈ ఎంపీల బృందం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో రెండు వారాల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొని వీరి విజయంలో పాలుపంచుకున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ట్వీట్ చేశారు. కాగా, తెలంగాణ గవర్నర్ గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి సైతం తమిళిసై సౌందర రాజన్ రాజీనామా చేసి పార్లమెంట్ ఎన్నికల్లో బరిలోకి దిగారు. అయితే చెన్నై సౌత్ నుంచి బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేసి తమిళిసై ఓడిపోయారు.




## ఇదే నేను మీకు విధిస్తున్న శిక్ష...

**ఆనంద్ మహీంద్రా ఆసక్తికర వ్యాఖ్యలు**

**విశ్వంభర, ముంబై:** టీ20 వరల్డ్ కప్ లో పాకిస్తాన్ పై భారత్ విజయం సాధించిన తీరుపై వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఆసక్తికర ట్వీట్ చేశారు. 'టీమ్ఇండియా లోస్కోరుకే పరిమితం కావడంతో పాకిస్తాన్ చేతిలో ఓటమి తప్పదనే భావనను మాకు కలిగించింది. కానీ తీవ్ర ఒత్తిడిలో మన ప్లేయర్లు విజయాన్ని పాక్ నుంచి లాక్కొని వారికి ఘోర అవమానాన్ని మిగిల్చారు. రోహిత్ సేన ఎదురుదాడి దారుణం. ఆటలో మీరెప్పటికీ హీరోలుగా ఉండాలి. ఇదే నేను మీకు విధిస్తున్న శిక్ష' అని ఆయన పేర్కొన్నారు. కాగా, కాగా ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 19 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌట్ అయింది. అటు పాకిస్తాన్ జట్టు 20 ఓవర్లలో...7 వికెట్లు నష్టపోయి 113 పరుగులు మాత్రమే చేసింది. టీమిండియా ఫాస్ట్ బౌలర్ బుమ్రా దాటికి.. పాకిస్తాన్ బ్యాటర్లు విలవిలాడిపోయారు. ఈ మ్యాచ్లో మూడు వికెట్లు పడగొట్టిన బుమ్రాకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ వచ్చింది.

## జగన్ ఇంట్లో పనివాళ్లకు ఉద్యోగాలు

**గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

**విశ్వంభర, రాజమండ్రి:** 'ఫైర్'లో భారతి పనిమనుషులు... అంటూ ఓ పత్రికలో వచ్చిన కథనంపై టీడీపీ సీనియర్ నేత, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సొంత కంపెనీలా పాలించిన జగన్ రెడ్డి... తన ఇంట్లో పనివారికి అగ్నిమాపకశాఖలో ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. జగన్ అర్ధాంగి భారతి రెడ్డి ఆదేశాల మేరకు 60 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, కడప ఎంపీ అవినాశ్ రెడ్డి సిఫారసుతో కూడా అడ్డగోలు నియామకాలు చేపట్టారని వివరించారు. ఈ ఉద్యోగాలు పొందడానికి వారికి ఉన్న అర్హత వారు జగన్, ఆయన భార్య భారతి, అవినాశ్ రెడ్డిల వద్ద పనిచేయడమేనని గోరంట్ల పేర్కొన్నారు.



## అమితాబ్ బచ్చన్ గెలిచిన ఆ సీటు..

**40 ఏళ్ల తర్వాత మళ్లీ దక్కించుకున్న కాంగ్రెస్**

**విశ్వంభర, అలహాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఉత్తరప్రదేశ్ లోని అలహాబాద్ లోక్ సభ స్థానాన్ని 40 సంవత్సరాల తర్వాత మళ్లీ ఇప్పుడు గెలుచుకుంది. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి నీరజ్ త్రిపాఠి, కాం గ్రెస్ నుంచి ఉజ్వల్ రమణ్ సింగ్ పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థిపై రమణ్ సింగ్ 58 వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. ఉజ్వల్ రమణ్ సింగ్ సమాజ్‌వాది పార్టీ సీనియర్ నేత రేవతి రమణ్ సింగ్ తనయుడు. ఉజ్వల్ గతంలో ఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ములాయం సింగ్ యాదవ్ మంత్రివర్గంలో పని చేశారు. అయితే కొన్నిరోజుల క్రితం ఎస్పీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇండియా కూటమి పొత్తులో భాగంగా అలహాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, గెలుపొందారు. అలహాబాద్ నుంచి కాంగ్రెస్ చివరిసారి 1984లో గెలిచింది. అప్పుడు కాంగ్రెస్ నుంచి బిగ్ బీ అమితాబ్ బచ్చన్ పోటీ చేసి గెలిచారు. కానీ మూడేళ్లకే ఆయన రాజీనామా చేయడంతో ఉపఎన్నిక జరిగింది. ఉపఎన్నికల్లో జన్ మోర్చా తరఫున వీపీ సింగ్ విజయం సాధించారు. నాటి నుంచి 2024 వరకు కాంగ్రెస్ పార్టీకి అలహాబాద్ అంద ని ద్రాక్షగానే మిగిలింది. ఆ తర్వాత వరుసగా ఒకసారి జనతా దళ్, మూడుసార్లు బీజేపీ, రెండుసార్లు ఎస్పీ, రెండుసార్లు బీజేపీ విజయం సాధించాయి.

## కేశినేని నానీ.. రాజకీయాల నుంచి ప్రజలే తప్పించారు

- బుద్దా వెంకన్న
- చంద్రబాబుకు కేశినేని నాని క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**విశ్వంభర, విజయవాడ:** విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు చేసిన ప్రకటనపై టీడీపీ నేత బుద్ధా వెంకన్న వ్యంగ్యంగా స్పందించారు. అయ్యా కేశినేని నానీ... నువ్వు రాజకీయాల నుంచి తప్పుకోవడం కాదు... ప్రజలే నిన్ను తప్పించారు అంటూ సెటైర్ వేశారు. రాష్ట్రమంతా వైసీపీ ఓడిపోవడం ఒకెత్తయితే, విజయవాడ ప్రజలు నిన్ను ఒక్కడ్నీ ఓడించడం మరో ఎత్తు అని ఎత్తిపొడిచారు. "రెండుసార్లు నిన్ను పార్లమెంటుకు పంపిన చంద్రబాబును పార్టీలోనే ఉంటూ ఇబ్బంది పెట్టినందుకు ప్రజలే నీకు బుద్ధి చెప్పారు. రెండుసార్లు పార్లమెంటుకు పంపిన చంద్రబాబుకు కనీసం కృతజ్ఞతలైనా చెబుతావని ఆశిస్తున్నాం. అలాగే, రెండోసారి నువ్వు గెలిచినప్పటి నుంచి నీ మాటలతో ఆయనను బాధపెట్టినందుకు క్షమాపణలు చెప్పాలని కోరుకుంటున్నాం" అంటూ బుద్ధా వెంకన్న ట్వీట్ చేశారు.

## ఆ భూములకు రైతుబంధు ఇవ్వం..

**వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**విశ్వంభర, వేములవాడ:** బీఆర్ఎస్ పాలనలో రియల్ ఎస్టేట్, కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయదు అని తెలిపారు. ఇప్పటివరకు 68 లక్షల మంది రైతులకు ₹7,625 కోట్లు ఇచ్చాం. అటు ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేసి తీరుతాం అని ధీమా వ్యక్తం చేశారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న ఛాలెంజ్కు హరీశ్రవు కట్టుబడి ఉండాలి. తన ఉనికిని కాపాడుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు' అని వేములవాడ ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌ది తొండి రాజకీయం అని,ఆగస్టు 15వ తేదీలోపు ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసి.. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఓపెన్ ఛాలెంజ్ చేశారు. మళ్లీ తాను ఎన్నికల్లో పోటీ చేయనని.. తనకు పదవులు ముఖ్యం కాదని ,'రైతు రుణమాఫీ, ఇచ్చిన హామీలు చేయకపోతే నువ్వు నీ సీఎం పదవికి రాజీనామా చేస్తావా..?' అని సవాల్ విసిరారు.






# 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు రంగం సిద్ధం

- ఇప్పటికే 98 పోస్టులు మంజూరు
- ఏర్పాటు సూత్రప్రాయంగా నిర్ణయం
- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ వెల్లడి



**విశ్వంభర, వైరా** : వైరాలోని కేవీసీఎం డిగ్రీ, ఎన్నార్ఐ పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో తాత్కాలికంగా వందపడకల ఆసుపత్రి ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆమేరకు సూత్రప్రాయంగా నిర్ణయం జరిగింది. ఆ విషయాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైద్యఆరోగ్యశాఖ అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సోమవారం వైరాలో మూతపడి ఉన్న కేవీసీఎం డిగ్రీ, ఎన్నార్ఐ పాలిటెక్నిక్ కళాశాల భవనాలను, పరిసరాలను సందర్శించి పరిశీలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన వైరాలో వందపడకల ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని నిర్ణయం జరిగింది. వందపడకల ఆనుపత్రికి శాశ్వత భవనాలు నిర్మించే వరకు వేచిచూడకుండా వెంటనే ప్రైవేట్ భవనాల్లోనైనా ఈ ఆసుపత్రిని ఏర్పాటుచేసి ప్రజలకు వైద్యసేవలందించేందుకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం మదిర వచ్చిన సందర్భంగా తనను కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు సూచించారు. దాంతో ఎమ్మెల్యే వెంటనే రంగంలోకి దిగారు. ఈ వందపడకల ఆసుపత్రికి శాశ్వత భవనాలు ఏర్పాటు చేసేందుకు సేకరించిన రెవెన్యూ కార్యాలయం వెనకభాగంలోని స్థలాన్ని ముందుగా పరిశీలించారు. ఈ స్థలంలో ఆసుపత్రి భవనాలు నిర్మించేందుకు కనీసం ఏడాది సమయమైనా పడుతుందని అప్పటివరకు వేచిచూడకుండా ఈ ఆసుపత్రిని ప్రైవేట్ భవనాల్లో ఏర్పాటుచేయాలని చర్చ జరిగింది. ప్రైవేట్ భవనాలకు బదులు గత పదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉంటున్న కేవీసీఎం విద్యాసంస్థల భవనాల్లో తాత్కాలికంగా వందపడకల ఆసుపత్రి ఏర్పాటుచేస్తే విశాలమైన ఆవరణం, పక్కాగా ఉన్న భవనాల్లో ఎలాంటి అద్దెలు లేకుండా ప్రభుత్వంపై ఆర్థికభారం లేకుండా ఉంటుందని, రోగులకు సౌకర్యవంతంగా ఉపయోగపడుతుందని భావించి ఈ విద్యాసంస్థలను పరిశీలించిన ఎమ్మెల్యే తదితరులు ఇక్కడే తాత్కాలిక ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. గత ఏడాది జూలైలో వైరాకు వంద పడకల ఆసుపత్రి మంజూరైంది. డాక్టర్ల సహా సిబ్బంది మొత్తం 98పోస్టులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టాఫ్ నర్సులను కూడా కేటాయించింది. ఇప్పటికే ఈ కేవీసీఎం విద్యాసంస్థలను విద్యావసరాల నిమిత్తం ప్రభుత్వానికి స్వాధీనం చేయటానికి యాజమాన్యం నిర్ణయించి ప్రతిపాదించింది. వెంటనే వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేసి శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఆసుపత్రిని అక్కడకు తరలించే విధంగా చర్చలు జరిపి నిర్ణయించారు. వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వేణు, వైరా పిహెచ్సి డాక్టర్ తాతా ఉదయలక్ష్మి, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, నాయకులు దాసరి దానియేలు, ఏదునూరి సీతరాములు, పమ్మి అశోక్, వల్లపు కొండలు, సూర్యదేవర శ్రీధర్, మల్లు రామకృష్ణ, మూడుముంతల గంగరాజు , పాలేటి నర్సింహారావు, పఠాన్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ దొంగల అరెస్ట్..




**విశ్వంభర, ఆర్మూర్ :** ఆర్మూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మోర్తాడ్ లో మోటార్ సైకిల్ పై వచ్చి మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు లాక్కొని పరారైన నలుగురు చైన్ స్నాచింగ్ దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ గట్టు బస్వా రెడ్డి చెప్పారు. ఆర్మూర్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఆర్మూర్ ఏసీపీ గట్టు బస్వా రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వా రెడ్డి మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్ కు చెందిన అబ్దుల్ సాజిద్, డిచ్ పల్లికి చెందిన బోయర్ శేఖర్, లక్షెట్టిపేట్ చెందిన పాతూరి తరుణ్, నిజామాబాద్ లోని మిర్చి కాంపౌండ్ కు చెందిన వర్మాజీ చంటి సాయికుమార్ లు ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో నుంచి పుస్తెల తాళ్లు, బంగారు గొలుసులను స్కూటీ, మోటార్ సైకిల్ పై వచ్చి లాక్కొని పరారయ్యే వారన్నారు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో, మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర గ్రామంలో, బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో వీరు చైన్ స్నాచింగ్ చేశారన్నారు. లక్ష్మణ్ చందా పోలీస్ స్టేషన్ పరిధిలోని పీచార గ్రామంలో, జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలమడుగు గ్రామంలో చైన్ స్నాచింగ్ చేశారన్నారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేగాం గ్రామంలో, లక్ష్మణ్ చాందా పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేశారన్నారు. ఈ నలుగురు దొంగలను మోర్తాడ్ మండలంలోని దొనకల్ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 11 లక్షల విలువగల 15.7 తులాల విలువగల ఏడు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నా మన్నారు. చోరీకి ఉపయోగించే ఒక నల్లటి స్కూటీ, ఎరుపు రంగులోని మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ వాహనాలకు నంబర్ ప్లేట్లు లేవన్నారు. ఈ కేసును భీంగల్ సీఐ శ్రీనివాస్, మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి లు చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు మోర్తాడ్ కానిస్టేబుళ్లు సురేష్, నారాయణ, కమ్మర్పల్లి కానిస్టేబుల్ నవీన్ చంద్రలను పోలీస్ కమిషనర్ అభినందించినట్లు చెప్పారు.

# వాటర్ వర్క్స్ పనులను పూర్తి చేయాలి



## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ నియోజకవర్గం లోని పలు డివిజన్లో ఆగిపోయిన వాటర్ వర్క్స్ పనులను త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం మెట్రో వాటర్ వర్క్స్ ఎండి సుదర్శన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కాలనీ వాసులతో కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో దాదాపు 80 కిలోమీటర్ల మేర నూతన వాటర్ పైప్ లైనులతో పాటు సుమారు 50 కోట్ల రూపాయలతో యుజిడి పనులు మంజూరు చేయించడం చేయించి పనులు ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే వెల్లడించారు .అలాగే అక్కడక్కడ మిగిలిపోయిన పనులు ఎలక్షన్ ముందు ఆగిపోవడం జరిగిందని ఆ పనులను త్వరలో పూర్తి చేయాలని వాటర్ వర్క్స్ మేనేజర్ కు ఎమ్మెల్యే వెల్లడించారు. ఆయా కాలనీవాసులకు ఇచ్చిన హామీ మేరకు అదనంగా ఈరోజు సుమారు 20 కోట్ల రూపాయలతో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మంజూరు చేయించడం జరిగిందని సుధీర్ రెడ్డి తెలిపారు. మరో 18 కిలోమీటర్ల మేర అదనపు వాటర్ పైప్లైన్లు మంజూరు చేయించడం జరిగిందని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గానికి అదనంగా 40 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాటర్ వర్క్స్ మేనేజర్ను కోరారు. ఈ కార్యక్రమంలో అనంతల రాజిరెడ్డి కటిక రెడ్డి అరవింద్ రెడ్డి శ్రీనివాస్ నాయక్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**విశ్వంభర, రాజేంద్రనగర్ :** బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని చింతల్ మెట్ ప్రాంతానికి చెందిన పాండు (50) సోమవారం సాయంత్రం రాజేంద్రనగర్ ప్రధాన రహదారిపై రోడ్డు దాటుతుండగా నౌ నెంబర్ నుంచి రాజేంద్రనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాండు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బంగారు నందిని అందుకున్న బాలయ్య

**విశ్వంభర, మహబూబ్ నగర్:** ఉత్తమ సామాజిక సేవలకు పట్టణంలోని సీనియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు బాలయ్యకు హైదరాబాద్ జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో 'జాతీయ బంగారు నంది' పురస్కారాన్ని అందజేశారు. 1976 లో ఎరుకల సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ తో డిల్లీకి వెళ్లి అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ని కలిసిన 21 మంది బృందంలో ఆయన ఒకరు ఉన్నారు. ఎరుకల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడుగా ఉండి ఎన్నో సేవలందించారు.బీద ఎరుకల విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు,గురుకృప ట్రస్టు నుంచి పేదలకు ఉచితంగా దుప్పట్లు,మందులు అందజేశారు. భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ నుండి 2016 లో జ్యోతిరావు పూలే అవార్డు,2019 లో దళిత రత్న బిరుదు లాంటి అనేక అవార్డులు ఆయన సొంతం చేసుకున్నారు.ఆయన సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# మాదకద్రవ్యాలపై నిఘా పెంచాలి ..

- చెరువుల సుందరీకరణ జరిపి ఆహ్లాదంగా తయారు చేయాలి
- పాఠశాలలో నాణ్యమైన విద్య అందించాలి
- గొర్రెల కొనుగోలు డబ్బులు తిరిగి ఇవ్వాలి
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు
- అదనపు కలెక్టర్ తో కలిసి అన్ని శాఖ అధికారులతో సమీక్ష




**విశ్వంభర, మెదక్ :** మత్తు మందు, గంజాయి రవాణాపై నిఘా పెంచి అరికట్టాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి మైనంపల్లి రోహిత్ రావు నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి ,రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అందించడంలో మొదటి స్థానంలో ఉంచాలన్నారు.

అన్ని శాఖల అధికారుల పని తీరును అడిగి తెలుసుకున్నారు.

అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతూ... వానాకాలం మొక్కలు నాటడం లక్ష్యాన్ని నెరవేర్చారన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని, మెదక్ నియోజకవర్గాన్ని పూల ,పండ్ల, ఔషధ మొక్కలతో ఆహ్లాదంగా తయారు చేయాలన్నారు.

పోలీస్ శాఖ అధికారులతో మాట్లాడుతూ... శాంతి భద్రతను పరిరక్షించాలని, ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని అక్రమ ఇసుక తరలింపు పై కఠినంగా వ్యవహరించాలన్నారు.

ఇసుక వ్యాపారం చేసే వారి మీద చర్యలు తీసుకోవాలి కానీ పేదవారు సాధారణ వ్యక్తులు గృహ నిర్మాణం కోసం ఇసుక తరలించే వారి మీద కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారి పైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతూ... ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండాలని, ఎరువులు విత్తనాల కొరత రానీయవద్దని, విత్తనాల కొరత ఎరువుల కొరత ఉంటే అధికారులు నన్ను డైరెక్టుగా మాట్లాడవచ్చు అన్నారు. నియోజకవర్గ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

హార్టికల్చర్ శాఖపై మాట్లాడుతూ... హార్టికల్చర్ శాఖను అభివృద్ధి పరచాలని జిల్లా రైతులకు హార్టికల్చర్ లో ఉన్నటువంటి మెలకువలు తెలపాలని, వ్యవసాయంలో ఆధునికత జోడించి అదనపు ఆదాయాలు ఏ విధంగా సంపాదించాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

సహకార సంఘాలపై మాట్లాడుతూ... సహకార సంఘాలు బలోపేతం కావాలని సహకార సంఘాలు ప్రజలకు ప్రభుత్వానికి వారధి లాగా రైతుల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు.

మెప్మా శాఖ పై మాట్లాడుతూ... మహిళలకు ప్రభుత్వం సమున్నత స్థానం కల్పిస్తుందని, మహిళా సాధికారత తమ ప్రభుత్వ ధ్యేయమని, మహిళా సంఘాలకు రుణాలు అందించడంలో శాఖ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ అభివృద్ధి శాఖ పై మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉపాధి అవకాశాలు లభించాలని , ఎస్సీ ఎస్టీల అభివృద్ధి తమ ఎజెండా అని, ఎస్సీ ఎస్టీలకు సమున్నత స్థానం కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య ,డిఆర్ డిఏ శ్రీనివాసరావు, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ,జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాకారులకు క్రికెట్ కిట్టు పంపిణీ

**విశ్వంభర, డిండి జూన్ 10:** ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్ ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం ఎడ్లగడ్డ తండా క్రీడాకారులకు క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎల్లవేళలా విద్యార్థులకు, యువతకు అందుబాటులో ఉంటుందని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధమోని శ్రీనివాస్‌గౌడ్, ముడావత్ రవి, ముడావత్ కృష్ణ, ఖాయ్యూం, ఉమర్, ముడావత్ సతీష్, పాండు, జైపాల్, సందీప్‌రెడ్డి, న్యాకం శ్రీను, ఎన్ఎస్‌యూఐ డిండి పట్టణాధ్యక్షులు అజయ్, సోహెబ్, శ్రీకాంత్, ఎదురు శివ తదితరులు పాల్గొన్నారు.

# మత్తుపదార్థాలను అరికట్టాలి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్




**విశ్వంభర, దేవరకొండ జూన్ :** దేవరకొండ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నివాసంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా దొంగతనాలను, యువత గంజాయి, ఇతర మత్తు మాదకద్రవ్యలకు వ్యసనం కాకుండా అరికట్టేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపాలని సూచించారు. నేరస్తుల పట్ల కఠినంగా ఉంటూ, సాధారణ ప్రజలకి అందుబాటులో ఉండి న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏడు మండలాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే మట్టా సమీక్ష సమావేశం



**విశ్వంభర, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణం పరిధిలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సత్తుపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో త్వరలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులు పై కూడా చర్చించారు. అధికారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, నియోజకవర్గ ఇరిగేషన్ అధికారులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

# 11న మహాశక్తి ఆలయంలో వార్షికోత్సవలు

**విశ్వంభర, కరీంనగర్ టౌన్ :** ఈనెల 11న కరీంనగర్ పట్టణంలోని చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో 14వ వార్షిక మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు పత్రికా ప్రకటనలో తెలిపారు. వేడుకల కోసం మా శక్తి దేవాలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబయిందన్నారు. తెలంగాణలోని శక్తివంతమైన ముగ్గురు అమ్మవార్లతో కొలువుదీరిన అరుదైన ఏకైక దివ్య క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన కరీంనగర్ మహాశక్తి దేవాలయంలో ఏ ఉత్సవమైన కండుల పండుగ అన్నారు.

ఉదయం 4:30 గంటలకు శ్రీ లక్ష్మి గణపతి స్వామి వారికి, శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు, అనంత నాగేంద్ర స్వామి వారికి జగద్గురువుల కరకములచే పంచామృతాభిషేకం, ఉదయం 8 గంటలకు స్వస్తి పుణ్యా వాచనము, గణపతి పూజ, అఖండ దీపారాధనము, సర్వతోభద్ర మండలం, లక్ష్మీ గణపతి హోమము, రుద్ర సహిత చండీ హోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగ అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం చేపట్టనున్నారు. సాయంత్రం 7 గంటలకు సుహాసినిలచే సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా కార్యక్రమాలను వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించనున్నారు. శ్రీ మహాశక్తి దేవాలయ చతుర్దశ వార్షికోత్సవ వేడుకల్లో పూజా కార్యక్రమాల్లో సమస్త హిందూ బంధువులందరూ పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొంది, కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



# జీహెచ్ఎంసీలో ప్రారంభమైన ప్రజావాణి

○ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 10:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మూడు నెలల తర్వాత తిరిగి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు.
నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉన్నందున జీహెచ్ఎంసీలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి ప్రతి సోమవారం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 27 ఫిర్యాదులు వచ్చాయని దాంతోపాటు ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 8 విన్నపాలు వచ్చాయని, వీటన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమస్యలను సకాలంలో పరిష్కరించని పక్షంలో సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని పేర్కన్నారు.
కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఎక్కువగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ప్రాపర్టీ టాక్స్ లకు సంబంధించిన విన్నపాలు ఎక్కువగా వచ్చిన నేపథ్యంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజావాణి విన్నపాలను అధికారులు నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే శ్రీవాత్సవ, శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీత రాధిక, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, యాదగిరి రావు, సీసీ పీ రాజేంద్రప్రసాద్ నాయక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ ఎంటమాలజి డాక్టర్ రాంబాబు, ట్యాక్స్ వాల్యుయేషన్ ఆఫీసర్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



## శంకర్ యాదవ్ భౌతిక కాయానికి మాజీ మంత్రి హరీశ్‌రావు నివాళి

**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరులు తలసాని శంకర్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు శంకర్ యాదవ్ భౌతిక కాయానికి నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బోయిన్ పల్లి మార్కెట్ అధ్యక్షుడిగా శంకర్‌యాదవ్ అందించిన సేవలు మరువలేనివని గుర్తుచేసుకున్నారు. శంకర్‌యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. ఆయన వెంట మాజీ టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రామకంఠం భూమిని కాపాడాలి

## డిప్యూటీ కలెక్టర్‌కు నిర్దవెల్లి గ్రామస్తుల వినతి



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 10:** కేశంపేట మండలం పరిధిలోని నిర్దవెల్లి గ్రామ కంఠం భూములు కబ్జా అవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్దవెల్లి గ్రామస్తులు మాజీ వైస్ ఎంపీపీ పల్లాటి సురేందర్ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ భూపాల్ రెడ్డికి తమ గ్రామ కంఠం భూములను కాపాడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ పల్లాటి సురేందర్, గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు కూడా అక్రమార్కులకు అండగా ఉండడంతో ప్రభుత్వ భూములను కబ్జాకు గురవుతున్నాయని అన్నారు. పలువురు గ్రామకంఠం భూమిని కబ్జా చేసి తమ సొంత పొలంగా చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో కేశవరం మురళీ తండ్రి/పేరు వెంకటయ్య అనే వ్యక్తి, ఉత్తర దిక్కున ఉన్న గ్రామ కంఠం పొలాన్ని తనకు సంబందించిన వ్యవసాయ పొలంగా కబ్జా చేశాడని పేర్కొన్నారు. ఈ విషయమై అతడితో మాట్లాడగా తన సొంత పొలం అంటూ చెబుతున్నాడని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జా గురైన భూమిని గ్రామానికి అప్పజెప్పాల్సిందిగా కోరుతున్నారు. ఈ కర్యక్రమంలో మాజీ సర్పంచ్ మేఘావత్ పన్ని, మాజీ ఉప సర్పంచులు కృష్ణయ్య, రంగయ్య, మల్లయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యులపై దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)జూన్ 10 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండలాధ్యక్షుడు వంగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి రోజు గ్రామాల్లో 24 గంటలు ప్రజల ఆరోగ్యమే బాధ్యతగా పెట్టుకొని నిత్యం వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్, స్టేట్ మెడికల్ కౌన్సిల్ పేరిట తనిఖీలు, దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు చోట్ల తనిఖీల పేరిట క్లినిక్‌పై పెట్టిన కేసులను కొట్టివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ దాడులతో భయభ్రాంతులకు గురౌతున్న గ్రామీణ వైద్యుల కుటుంబాలకు ఏమి జరిగిన ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామీణ వైద్యులకు గుర్తింపు పత్రాలు ఇచ్చి గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటే మేము కూడా ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ పథకాల్లో భాగస్వాములమై మా వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బీఎల్ నారాయణగౌడ్, మండల కోశాధికారి గడ్డం అశోక్ , మండల ప్రచార కార్యదర్శి గుర్రం మల్లేశ్, మండల నాయకులు అంజిరెడ్డి, శ్రీనివాస్, మచ్చగిరి, నాగరాజు, శ్రీనివాస్, నరేందర్, దేవదాస్, నర్సింహ, శ్యామ్, బాలగంగాధర్, మధు, నరహరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



లోక్ సభ ఎన్నికలలో చారిత్రాత్మకంగా మూడవసారి విజయం సాధించి, కోట్లాది మంది భారతీయుల జీవితాల్లో ఆశాకిరణంగా, ప్రపంచం గర్వించదగ్గ నాయకులుగా, భారతదేశ ప్రధానిగా మూడవసారి ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోడీకి శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాపర్తి ప్రకాష్ హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు.

-విశ్వంభర, హైదరాబాద్



## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి శుభాకాంక్షలు

**విశ్వంభర, బషీర్‌బాగ్ :** కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌కుమార్‌ను తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డీ రిషికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో పథంలో నడిపించే విధంగా కృషి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేశారు.

## రైతులకు విత్తనాలకు బిల్లులు ఇవ్వాలి



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 10:** ఆమనగల్లు మండలంలోని అధీకృత విత్తన డీలర్లను వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విత్తన నిలువలు, ఎరువుల నిలువలు ఇన్వాయిస్‌లు, బిల్లులు మరియు ధరల పట్టిక బోర్డులను పరిశీలించారు. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, స్టాకును ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అరుణకుమారి, డీలర్లు సురేష్, జంగయ్య, చంద్రశేఖర్, రవి, వెంకటయ్య, రాజు, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.
విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

## ఘనంగా పున్నా కైలాష్ నేత జన్మదిన వేడుకలు



**విశ్వంభర, నారాయణపూర్ జూన్ 10:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ హాస్పటల్‌లో కైలాష్ నేత వీరాభిమాని కైసర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కీలక పాత్ర పోషించిన ఉస్మానియ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి హాస్పటల్‌లో ఉన్న రోగులకు, హాస్పటల్ సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐఎన్టీయూసీ మునుగోడు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పగిళ్ళ నరేష్, ఎస్సీ సెల్ మండల నాయకుడు గోపాల్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అందె నరేష్, అబ్బు, రాజు, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కిషన్‌రెడ్డిని కలిసిన భరత్

**విశ్వంభర, కల్వకుర్తి జూన్10:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సోమవారం వారి కార్యాలయంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, కల్వకుర్తి జడ్పీటీసీ పోతుగంటి భరత్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# డ్రగ్స్ ఇన్స్పెక్టర్ల నియామకం

○ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌ను బలోపేతానికి చర్యలు చేపట్టాం
○ నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులకు : మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశా నిర్దేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మెరిట్ ఆధారంగా ఎంపికైన జోన్ I నుంచి 5 గురికి, జోన్ II నుంచి 12 మందికి, మొత్తంగా 17 మంది డ్రగ్స్ ఇన్స్పెక్టర్లకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మందుల తయారీదారులపై ఉక్కు పాదంతో అణిచివేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. నూతనంగా ఎంపికైన 17 మంది డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు శాఖ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. నకిలీ మందుల నివారణకు నిరంతర పర్యవేక్షణ కోసం నూతనంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ నియామకాన్ని చేపట్టిందన్నారు. ఎంతో బాధ్యతగా సమాజ హితం కోసం ఉద్యోగ విధులను నిర్వహించాలని నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులకు మంత్రి దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్ జనరల్ ఆర్‌వీ కర్ణన్, జాయింట్ డైరెక్టర్ రామ్ దాన్‌లు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను ఎన్ఆర్ఐలు దత్తత తీసుకోవాలి

## సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహా రెడ్డి




**విశ్వంభర, ఆమనగల్ :** అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటా భారతీయులు ఏర్పాటు చేసిన తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు. టీడీఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రవాస భారతీయులు తెలంగాణలో విద్య, వైద్యం, నీటిపారుదల మొదలగు అంశాల పైన చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న విద్యా పథకాలు సత్ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వ మరియు ప్రవాసభారతీయుల భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో ఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలని, ప్రతి ఎన్ఆర్ఐ సొంత ప్రాంతాల్లో ఉన్న పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్ ఫౌండర్ మధు కే రెడ్డి, కిషోర్ గూడూరు, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

# కొత్తూరు ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి

### అధికారులతో ఎంపీపీ సమీక్ష సమావేశం



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 10:** వ్యవసాయ సీజన్ వచ్చింది కావున రైతులకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అధికారులకు సూచించారు.
కొత్తూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో విద్య, విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులతో ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. సందర్భంగా ఎంపీపీ విద్యుత్ శాఖ అధికారితో మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, నూతన విద్యుత్ స్తంభాల సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ.. ముందస్తుగా పంటలను వేసే విధంగా రైతులను ప్రోత్సాహించాలని, నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్త వహించాలని, బ్యాన్ అయిన విత్తనాలు వేరే వేరే పేర్లతో వస్తున్నాయని, వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధ్యమైనంత వరకు రైతులకు మేలు చేయాలని, రైతుల పట్ల సానుభూతిగా ఉండాలని సూచించారు. మనం ఉన్నది ప్రజలకు సేవ చేయటానికే, ఎవ్వరు చేయవల్సిన పని వాళ్ళు చేయాల్సిదిందేనని, రైతును రాజును చెయ్యాలని నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, ఎలక్ట్రికల్ సిటీ ఏఈ సాయి కృష్ణ, వ్యవసాయ శాఖ ఏ ఈ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తలకొండపల్లిలో బీజేవైఎం సంబురాలు



**విశ్వంభర, ఆమనగల్లు జూన్10 :** తలకొండపల్లి మండల కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా మరియు కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తలకొండపల్లి మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు టాపాకులు కాల్చి మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తపరిచారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మా అనిల్, బీజేపీ నాయకులు పోతుగంటి మహేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

- గ్రామీణ ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుంది
- రాష్ట్ర సదస్సులో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క




**విశ్వంభర, హైదరాబాద్ :** గత ఎన్నికల ముందు గ్రామీణ పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో సోమవారం నిర్వహించిన సదస్సులో మంత్రి సీతక్క ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పని దినాలను 150 రోజులకు, కనీస వేతనం 400 రూపాయలు పెంచడం పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింప చేయడం కోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు. యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్షాల కోరిక మేరకు ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిని కల్పించే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తెచ్చారని గుర్తు చేశారు. కానీ నేడు బీజేపీ ప్రభుత్వం ఉన్న పనిని ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో పార్లమెంట్లో పోరాటం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అన్ని సమస్యల పరిష్కారం కోసం తాను కృషి చేస్తానని పేర్కొన్నారు.

**ధరల కనుగుణంగా కనీస వేతనం పెంచాలి**
**రాజ్యసభ సభ్యులు శివ దాసన్ డిమాండ్**

దేశవ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరల కనుగుణంగా వేతనాలను పెంచాలని, చట్ట ప్రకారం వారం వారం వేతనాలు చెల్లించాలని, అడిగిన వారికి పని ఇవ్వకుంటే నిరుద్యోగ భృతిని కల్పించాలని రాజ్యసభ సభ్యులు శివదాసన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలీ 300 రూపాయలు ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని ఆరోపించారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశానంటున్నాయని, ఉపాధి కూలీ పనికి పోతే రోజు కూలీ 100 రూపాయలు కూడా రావడం లేదని ఆవేదన చెందారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

**చట్టం రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం చేపడతాం**
**బీ వెంకట్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి**

వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వందరోజుల పనిని గ్యారెంటీ చేస్తూ.. తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం గొంతు నులిమే ప్రయత్నం చేస్తుందని, దీని రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీ వెంకట్ అన్నారు.

సమస్యలతో కూడిన తీర్మానాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రవేశపెట్టారు వాటన్నిటినీ దరఖాస్తు రూపంలో మంత్రికి రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్యతోకూడిన బృందం అందజేశారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ ప్రసాద్, బీ పద్మ వ్యవహరించగా.. అఖిల భారత కమిటీ నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, నారీ ఐలయ్య, కొండమడుగు నరసింహ, జగన్, వెంకటయ్య, సాంబశివ, ఆవుల వీరన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటిలో డెడ్ బాడీ.. పోలీసులు వచ్చి చూస్తే షాక్..!



**విశ్వంభర, హనుమకొండ:** తాగు నీటిలో డెడ్ బాడీ స్థానికులను కనిపించింది. దాదాపు 12 గంటలు అక్కడే ఆ డెడ్ బాడీ ఉండటంతో స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీరా పోలీసులు అక్కడకు వచ్చి చూస్తే వాళ్లకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. ఎందుకంటే అతను చనిపోలేదు.. బతికే ఉన్నాడు.

హనుమకొండలోని రెడ్డిపురం కోవెలకుంటలో గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి 12 గంటల దాకా నీటిలోనే పడుకున్నాడు. కానీ అతను చనిపోయాడేమో అని భావించిన స్థానికులు కేయూ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు వచ్చి అతను చనిపోయాడేమో అని అతని చేయి పట్టుకుని లాగారు. కానీ అతను బతికే ఉన్నాడు. దాంతో అందరూ షాక్ అయ్యారు. అసలు నీటిలో ఎందుకు పడుకున్నావ్ అని అడిగితే.. రోజూ గ్రానైట్ కంపెనీల్లో 12 గంటలు ఎండకు పని చేసి తట్టుకోలేకపోయానని.. చల్లదనం కోసమే నీటిలో పడుకున్నానని తెలిపాడు. ఆయనది నెల్లూరు జిల్లా కావలికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఆయనకు తిరిగి వెళ్లడానికి డబ్బులు ఇచ్చి పంపించేశారు.

## విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి




**విశ్వంభర, ఆదిలాబాద్:** కరెంట్ స్తంభం ఎక్కిన ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే విద్యుత్ సిబ్బంది ఆలస్యంగా స్పందించారు. దీంతో నాలుగు గంటల పాటు అతడి మృతదేహం స్తంభంపైనే ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే నిండుప్రాణం పోయిందని కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా యాపల్ గూడ గ్రామంలో విద్యుత్ మోటార్ కనెక్షన్ ఇవ్వడానికి మోతిరాం(38) అనే ఎలక్ట్రీషియన్ వెళ్లాడు. అతడు స్తంభం ఎక్కగానే విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మోతిరాం మృతిచెందాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. సుమారు 4గంటల పాటు మృతదేహం స్తంభంపైనే ఉంది. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. మోతిరాం తమకు సమాచారం ఇవ్వకుండా కరెంటు పోల్ ఎక్కాడని తెలిపారు. చివరకు రూ.5లక్షల పరిహారం అందజేస్తామని విద్యుత్ శాఖ అధికారులు అంగీకరించారు.

## కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

### బీఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్



**విశ్వంభర, దేవరకొండ :** వానాకాలం రైతు బంధు తక్షణమే రైతుల ఖాతాల్లో జామచేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యుడు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వానాకాలం వచ్చింది కానీ రైతులకు పంట పెట్టుబడి సహాయం గురించి కాంగ్రెస్ నోరు మెదపడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతు బంధు పైసలు పడేవని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు భరోసా షరతులు లేకుండా ఎకరాకు రూ. 7500 ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పంట కాలానికి ముందే ప్రతి ఎకరాకు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రైతులను మోసం చేయడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యల మీద, రైతు సమస్యల మీద రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.
ఉపాధి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

## సీనియర్ మెట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలి

### మంత్రి సీతక్కకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 10:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ఏర్పాటు చేయబడ్డ గ్రామపంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని మరియు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వీధులలోకి తీసుకొని కనీస వేతనం 26000 ఇవ్వాలని సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, అదేవిధంగా ఉపాధి కార్మికులకు కనీస రోజు కూలీ 600 రూపాయలు ఎలాంటి కొలతలు లేకుండా ఇవ్వాలని కనీస పని దినాలు 200 రోజులు కల్పించాలని గ్రామీణ ప్రాంతం తోపాటు పట్టణ ప్రాంతంలో కూడా ఉపాధి హామీ పనిని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సులో షాద్‌నగర్ పట్టణం నుంచి వ్యవసాయ కార్మికులు ఉపాధి కార్మికులు సీనియర్ మెట్లు తరలి వెళ్లినట్టు వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్చార్జి శ్రీను నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీల సమస్య లతో కూడిన వినతి పత్రాన్ని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు పని కల్పిస్తున్న సీనియర్ మేట్లకు ప్రభుత్వం వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్, కొందుర్గు, కేశంపేట్, జిల్లెడు చౌదరి గూడెం, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కార్మికులు, సీనియర్ మెట్లు కావలి ఆంజనేయులు, శంకర్, కన్న, జంగయ్య, మల్లేష్, రమేష్, కే రాజు తదితరులు పాల్గొన్నారు.



## పరిశ్రమ నుంచి రైతులను కాపాడాలి



**విశ్వంభర, ఆమనగల్లు జూన్10:** రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం అప్ప రెడ్డిపల్లి శివారులో ఉన్న ఐఎంఆర్ అగ్రి ఫీడ్ పరిశ్రమ వెదజల్లుతున్న దుర్వాసన నుంచి పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న రైతులను కాపాడాలని, పరిశ్రమకు వెళ్లే రహదారిని జెసీబీతో వాహనాలు వెళ్లకుండా రహదారి రైతులు పెకిలించారు. అగ్రి ఫీడ్ కంపెనీ అని మాయమాటలు చెప్పి రహదారి వేసుకున్నారని పరిశ్రమలో ఏం తయారవుతుందో జంతు కళేబరాలు ఎందుకు పరిశ్రమకు వెళ్తున్నాయో ఎవరూ చెప్పడం లేదని, ఎన్ని ఆఫీసుల చుట్టూ తిరిగినా ఎంతోమంది అధికారులకు మోర పెట్టుకున్న ఎందుకు కంపెనీ మీద చర్యలు తీసుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. పశువులు, మూగజీవాలు ఈ ప్రాంతంలో తిరగలేకపోతున్నాయని పచ్చని పొలాల్లో చిచ్చుపెట్టిన పరిశ్రమను తరలించాలని లేదా వచ్చే దుర్వాసనను అరికట్టి మా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### మొదళ్ళ గుడ గ్రామంలో మైసమ్మ తల్లి వార్షికోత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 10:** అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కోరారు. సోమవారం నందిగామ మండలంలోని మొదళ్ళగూడ గ్రామంలోని మైసమ్మ తల్లి మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాఘతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని, శాసన మండలిలో స్థానిక ప్రజా ప్రతినిధుల సమస్యలపై ప్రశ్నిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాధవి రవీందర్, తాజా మాజీ సర్పంచ్ నాగర్కుంట ఉమా ప్రవీణ్ రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు..

- విత్తన కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు..
- పోలీస్ కళా బృందం అవగాహనలో ఎస్సై జి అజయ్ కుమార్




**విశ్వంభర, నడిగూడెం:** అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదని, చట్టాలను చేతుల్లోకి తీసుకుని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి అజయ్ కుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు సోమవారం నడిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని త్రిపురారం గ్రామంలో పోలీస్ కళాజాత బృందంతో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని, వ్యాపారుల ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రస్తుత కాలంలో మూఢనమ్మకాలను నమ్మొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి వ్యక్తిగత వివరాలను, బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ వివరాలను తెలుపవద్దని పేర్కొన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని, వేధింపులు, అత్యవసర సమయాల్లో 100 కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వీరబాబు, ప్రతాపరెడ్డి, కళాబృందం ఇన్ చార్జ్ యల్లయ్య,గోపి, కృష్ణ, చారి పాల్గొన్నారు.



## యువత స్వయంకృషితో ఎదగాలి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**విశ్వంభర, చింతపల్లి :** యువత స్వయంకృషితో ఎదగాలని దేవరకొండ శాసన సభ్యుడు నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని ఆర్ఆర్ ఫ్లెక్సీ బ్యానర్స్ నూతన షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతీ యువకులు స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. తాము ఉపాధి పొందడమే కాకుండా మరి కొందరికి ఉపాధి చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, ఎంపీపీ కొండూరు భవాని, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా

### ఆత్మకూరులో బీజేపీ శ్రేణుల సంబురాలు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) జూన్ 10 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు గజరాజ్ కాశినాథ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప లక్ష్యసాధనగా ముందుకు సాగుతూ సుపరిపాలన, అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం పాలన చేసి వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీకి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. టాపాకలు కాల్చి సంబురాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బొబ్బలా ఇంద్రారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ కార్యదర్శి బండారు సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు సైరెడ్డి చంద్రారెడ్డి, ఎస్సీ మోర్చ మండల అధ్యక్షుడు మేడి సాగర్, బీజేవైఎం మండల అధ్యక్షులు పైళ్ల ప్రశాంత్, మండల కార్యదర్శి బూడిద నర్సింహా, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మహేష్,ఎస్సీ మోర్చ మండల ప్రధాన కార్యదర్శి మధు, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి సూర్య, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, వెంకట్ రెడ్డి, రాగటి మచ్చగిరి, మహేష్, అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆకుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కేబినెట్ మంత్రిగా వరుసగా రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన గంగపురం కిషన్‌రెడ్డి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తూ.. కాపర్తి ప్రకాశ్ శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ హైదరాబాద్ హార్దిక శుభాభినందనలు తెలిపారు.
- విశ్వంభర, హైదరాబాద్

# రాష్ట్రపతి భవన్‌లో చిరుత..?

- అనుమానాస్పద జంతువు సంచారం
- మంత్రుల ప్రమాణ స్వీకారంలో కనిపించిన దృశ్యం
- చిరుతపులా లేక పెంపుడు జంతువా అంటూ కామెంట్లు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో
- స్పందించని రాష్ట్రపతి భవన్ వర్గాలు



**విశ్వంభర, ఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో అతిరథ మహారథుల మధ్య మూడోసారి భారత ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం చేశారు. వీఐపీలు ఉన్న ఆ ప్రదేశంలో చిరుత లాంటి ఓ జంతువు స్వేచ్ఛగా తిరుగుతుండటం సంచలనంగా మారింది. మోడీ, 71 మంది కేంద్ర మంత్రులతోనూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ బీజేపీ ఎంపీ దుర్గాదాస్ మంత్రిగా ప్రమాణం చేసి.. సంతకాలు పెట్టి పేపర్‌వర్క్ పూర్తి చేసి కుర్చీలోంచి లేస్తున్నారు. అప్పుడు వెనుకాల మెట్ల తర్వాత వరండాలో చిరుతపులి తిరుగుతున్నట్టు కనిపిస్తుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు ఆసక్తికరమైన కామెంట్లు చేస్తున్నారు.

### చిరుదపులా లేక పెంపుడు జంతువా?

చిరుతలను కూడా రాష్ట్రపతి భవన్‌లో పెంచుతున్నారా అని నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అవి చిరుతలు కాదని పిల్లి లేదా కుక్క అయ్యి ఉంటుందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. కాదు కాదు అవి చిరుతలేనని మరికొందరు అంటున్నారు. 'ఒకవేళ అది పిల్లి అయితే ఏం ఇబ్బంది లేదు.. కానీ చిరుత అయితే భద్రతా సిబ్బంది ఏం చేస్తున్నట్లు.. ఇది రాష్ట్రపతి భవన్‌లో పూర్తిగా భద్రతా ఉల్లంఘనే?' అని ఓ నెటిజన్ మండిపడ్డాడు. దాని తోక, ఆకారం చూస్తే అది చిరుతపులిలాగే ఉంది.. ఆ జంతువు ఏమీ పట్టనట్టు ప్రశాంతంగా వెళ్లిపోవడంతో అక్కడున్న వాళ్లు నిజంగా అదృష్టవంతులు' అని మరో యూజర్ కామెంట్ పెట్టాడు.

### స్పందించని రాష్ట్రపతి భవన్ వర్గాలు

ఏది ఏమైనప్పటికీ ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాష్ట్రపతి భవన్ కారిడార్‌లో తిరుగుతున్న జంతువు గురించి తెగ చర్చ జరుగుతోంది. రాజధాని ఢిల్లీలో ఉన్న రాష్ట్రపతి భవన్ ఎంతో ప్రత్యేకమైంది. ఎందుకంటే భారత్‌కు విచ్చేసే ప్రతి ప్రధాన విదేశీనేత గౌరవార్థం అక్కడే ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారు. చాలా కాలంగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. మూడు లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ భవనంలో 340 గదులు ఉంటాయి. 90 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ భవనానికి ఆర్కిటెక్చర్ ఎడ్విన్ లూటిన్స్.. పలు ప్రభుత్వ కార్యక్రమాలు, విందులు, ఆతిథ్యానికి వేదికైన రాష్ట్రపతి భవన్‌లో రెండు వంటశాలలు ఉన్నాయి. ఒకటి రాష్ట్రపతి వ్యక్తిగత వంటగది కాగా.. రెండోది రాష్ట్రపతి భవన్‌లోని అన్ని అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు, విందులు, సమావేశాలలో క్యాటరింగ్ ఏర్పాట్లకు బాధ్యత వహిస్తుంది. ఆ వింత జంతువు కనిపించడం రచ్చ రేపుతోంది. ఈ ఘటనపై ఇప్పటివరకు రాష్ట్రపతి భవన్ వర్గాలు స్పందించలేదు.

# నేను రాజీనామా చేయడం లేదు

- కేంద్ర మంత్రిగా పనిచేస్తా
- కొన్ని మీడియాల తప్పుడు ప్రచారం
- రాజీనామా వార్తలపై కేంద్ర మంత్రి సురేష్ గోపి క్లారిటీ



**విశ్వంభర, కేరళ:** కొన్ని మీడియా ప్లాట్ ఫామ్స్ లో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అన్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి తాను రిజైన్ చేస్తారంటూ వస్తున్న వార్తలను తప్పుబట్టారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేరళలోని త్రిసూర్ లోక్ సభ స్థానం నుంచి నటుడు సురేష్ గోపి విజయం సాధించిన విషయం తెలిసిందే. కేరళ నుంచి గెలిచిన ఏకైక బీజేపీ ఎంపీ ఆయనే కావడం విశేషం. దీంతో ఆయనకు మంత్రి పదవి సైతం లభించింది. ఆదివారం ప్రధాని మోడీతో పాటు ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఆయన రాజీనామాకు సిద్ధం అవుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ప్రమాణస్వీకారం చేసిన కొద్ది గంటల్లోనే సురేష్ గోపి మనస్సు మార్చుకున్నారని ప్రచారం నడిచింది. దీనిపై ఆయన క్లారిటీ ఇచ్చారు. తన ఎక్స్ ఖాతాలో ఈ అంశంపై పోస్ట్ చేశారు. తాను కేంద్ర మంత్రి పదవిని వదులుకుంటున్నట్లు వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. 'కొన్ని మీడియా సంస్థలు తాను కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానంటూ తప్పుడు వార్తను ప్రచారంలోకి తెచ్చాయి. అది పూర్తిగా అబద్ధం. ప్రధాని మోడీ నాయకత్వంలో కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని తాము కృతనిశ్చయంతో ఉన్నాం' అని సురేష్ గోపి తన పోస్టులో తెలిపారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

### ఎన్సీపీ అధినేత శరద్ పవార్



**విశ్వంభర, మహారాష్ట్ర :** ఈ ఏడాది చివర్లో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ తమ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ 25వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'గత 25 ఏళ్లలో పార్టీ సిద్ధాంతాలను వ్యాప్తి చేయడానికి ఎంతో కృషి చేశాం. దానిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పని చేయాలి. మరో మూడు నెలల్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. దాని ఇప్పటి నుంచే సమిష్టిగా అడుగులు వేయాలి' అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అధికారం ఒకరిద్దరు చేతిలో కేంద్రీకృతం కావడానికి చెక్ పెట్టేందుకే ప్రజలు ఓట్లు వేశారని స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. నేడు దేశం భిన్నమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని పవార్ అన్నారు. గత ఐదేళ్లలో కేవలం ఒకరిద్దరు మాత్రమే తమ ఇష్టానుసారంగా ప్రభుత్వాన్ని నడిపారని, దేశం గురించి విశాల దృక్పథంతో ఆలోచించలేదని, అధికార కేంద్రీకరణకు పెద్దపీట వేయలేదని విమర్శించారు. అయితే దేశ ప్రజలు రాబోయే పరిస్థితులను ఊహించి, ఒకరిద్దరు వ్యక్తుల చేతుల్లో అధికారం ఉండకుండా చేశారన్నారు. ఈ సందర్భంగా పవార్ తన కుమార్తె బారామతి ఎంపీ సుప్రియా సూలే, ఇతర నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండాను ఎగురవేశారు. కాగా, పవార్ 1999లో కాంగ్రెస్ నుంచి విడిపోయి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని స్థాపించారు. పలు రాజకీయా పరిణామాల దృష్ట్యా ఈ ఏడాది ఆ పార్టీ రెండు వర్గాలుగా చీలిన విషయం తెలిసిందే.

# బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను కలిసిన సోనియాగాంధీ

- సోనియాతో పాటు షేక్ హసీనాను కలిసిన రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ
- ఇరుకుటుంబాల మధ్య అనుబంధాన్ని గుర్తు చేసుకున్న అగ్రనాయకులు
- షేక్ హసీనాను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న గాంధీ కుటుంబం



**విశ్వంభర, ఢిల్లీ:** బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీ, ఎంపీ రాహుల్ గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ కలిశారు. నిన్న మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బంగ్లాదేశ్ ప్రధాని వచ్చారు. ఇక్కడే ఉన్న షేక్ హసీనాను నెహ్రూ కుటుంబం కాంగ్రెస్ నేతలు కలిశారు. ఇరు కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని వారు గుర్తుచేసుకున్నారు. సోనియా, రాహుల్, ప్రియాంకలు బంగ్లా ప్రధానిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

# ప్రధాని మోడీకి శుభాకాంక్షలు తెలిపిన పాక్ పీఎం



**విశ్వంభర, ఢిల్లీ :** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ప్రెసిడెంట్ ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. మోడీ ప్రధానమంత్రిగా మూడోసారి ప్రమాణం చేశారు.వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన మోడీకి దేశ, విదేశాల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే అమెరికా, కెనడా, ఇటలీ వంటి అగ్రదేశాల నేతలు మోడీకి అభినందనలు తెలుపగా.. తాజాగా పాకిస్థాన్ ప్రధాని మోడీకి శుభాకాంక్షలు తెలిపారు. వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన ప్రధాని నరేంద్ర మోడీకి అభినందనలు అని పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగిన మోడీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి 7 దేశాల అధినేతలు, భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పలువురు సీఎంలు, ఖర్గే, ముకేశ్ అంబానీ, అదానీ, సూపర్ స్టార్ రజినీకాంత్, షారుఖ్ ఖాన్, అక్షయ్ కుమార్ సహా 8 వేల మంది ప్రముఖులు హాజరయ్యారు.



## కెనడాలో భారత సంతతి యువకుడు దారుణ హత్య

**విశ్వంభర, పంజాబ్:** భారత సంతతికి చెందిన యువరాజ్ గోయల్(28) అనే యువకుడు కెనడాలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ నెల 7న గోయల్ సర్రేలోని తన ఇంట్లో ఉండగానే నిందితులు విచక్షణ రహితంగా అతనిపై కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించినట్టు పోలీసులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే గోయల్ ఇంటికి వెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వెల్లడించారు. అయితే హత్యకు గల కారణాలు తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే నలుగురు అనుమానితులను అరెస్టు చేశారు. వారిని సర్రేకు చెందిన మన్విర్ బస్రామ్, సాహిబ్ బస్రా సర్రే, హర్కీరత్ జుట్టి, అంటారియోకు చెందిన కెయిలాన్ ఫ్రాంకోయిస్‌లుగా గుర్తించారు. కాగా, పంజాబ్‌లోని లుథియానాకు చెందిన గోయల్ 2019లో కెనడాకు వెళ్లారు. ఇటీవలే కెనడాలో శాశ్వత నివాస హోదా పొందారు. అక్కడ ఆయన ప్రస్తుతం సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. గోయల్ కాల్చి చంపబడటానికి కొద్దిసేపటి ముందు తన తల్లితో ఫోన్ కాల్ మాట్లాడినట్టు తెలుస్తోంది. యువరాజ్‌కు ఎటువంటి నేర చరిత్ర లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కెనడాకు వెళ్లడానికి కన్నా ముందు యువరాజ్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ (ఆనర్స్) పూర్తి చేశాడు.



## వందేభారత్, జనశతాబ్ది రైళ్లకు తప్పిన పెను ప్రమాదం

**విశ్వంభర, గయా :** వందేభారత్, జనశతాబ్ధి రైళ్లకు పెను ప్రమాదం తప్పింది. బీహార్‌లోని గయ జిల్లాలో ఈ ఘటన జరిగింది. గయ జిల్లాలో ఈస్ట్ సెంట్రల్ రైల్వే గ్రాండ్ కార్డ్ రైల్వే సెక్షన్ పరిధిలోని మాన్‌పూర్ జంక్షన్‌లో హోమ్ సిగ్నల్ దగ్గర ఓవర్‌హెడ్ వైరు తెగిపోయింది. ఈ నేపథ్యంలో రాంచీ-పాట్నా వందే భారత్ ఎక్స్‌ప్రెస్, రాంచీ-పాట్నా జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్‌లను ముందుజాగ్రత్త చర్యగా అంతకు ముందుగల స్టేషన్‌లలో నిలిపివేశారు. దీంతో వందే భారత్-జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెను ప్రమాదం తప్పింది. రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. రైల్వే సిబ్బంది వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. రాత్రి 9గంటలకు మరమ్మతు పనులు పూర్తయ్యాక ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాద సమయంలో వందే భారత్ ఎక్స్ ప్రెస్ గుర్పా రైల్వే స్టేషన్‌లో నిలిపారు. అదేవిధంగా జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్‌ను టంకుప్ప రైల్వే స్టేషన్‌లో నిలిపినట్లు రైల్వే అధికారులు వివరించారు.



## మణిపూర్ సీఎం సెక్యూరిటీ కాన్వాయ్‌పై మిలిటెంట్ల దాడి..!

**విశ్వంభర, మణిపూర్ :** మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై అనుమానిత మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. కంగ్‌పోక్పి జిల్లాలో సోమవారం ఉదయం ఈ దాడి జరిగింది. దాడిలో సెక్యూరిటీ సిబ్బంది ఒకరు గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల హింస చోటుచేసుకున్న జిరిబమ్ జిల్లాకు రేపు ముఖ్యమంత్రి వెళ్ళాల్సి వుంది. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం కాన్వాయ్ వెళ్తున్న సమయంలో దాడి జరిగినట్లు తెలిపారు. రక్షణ దళాలపై మిలిటెంట్లు పలుమార్లు కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ఆ దాడిని తిప్పికొట్టాయి. జాతీయ రహదారి 53పై ఉన్న కొట్లెన్ గ్రామం వద్ద ప్రస్తుతం ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు సమాచారం. ఎదురుకాల్పుల్లో బుల్లెట్ల గాయాల వల్ల ఒక జవాన్ గాయపడ్డారు. సీఎం బీరేన్ సింగ్ ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. ఆయన ఇంకా ఇంఫాల్‌కు చేరుకోవాల్సి ఉంది. జిరిబమ్‌కు ఆయన వెళ్లనున్నారు. శనివారం రోజున మిలిటెంట్లు రెండు పోలీసు ఔట్‌పోస్టులు, ఓ ఫారెస్ట్ బీట్ ఆఫీసు, 70 ఇళ్లకు నిప్పు పెట్టారు. దీంతో వందలాది మంది ప్రజలు ఆ ప్రాంతం నుంచి తరలిపోయారు. కాగా, ఈ నెల 6న గుర్తుతెలియని దుండగులు స్థానికంగా ఉండే ఓ వ్యక్తిని అతి కిరాతంగా హతమార్చడంతో జిరిబమ్‌లో గత కొన్ని రోజులుగా అశాంతి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి సందర్శించాలని అనుకున్నారు. ఈ క్రమంలో ఈ ఘటన చోటు చేసుకోవడం కలకలం సృష్టిస్తోంది.




## 13 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, ఢిల్లీ:** ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. జూలై 10న ఈ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. నామినేషన్ కు చివరి తేదీ జూన్ 21 కాగా, జూన్ 24న నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీ జూన్ 26గా నిర్ణయించింది. జూలై 13న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

### ఎన్నికలు జరిగే స్థానాలు ఇవే..

బీహార్ రాష్ట్ర (రూపౌలి నియోజకవర్గం), పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ( రాయ్ గంజ్, రణఘాట్ సౌత్, బాగ్దా, మాణిక్తలా), తమిళనాడు రాష్ట్ర (విక్రవాండి), మధ్యప్రదేశ్ రాష్ట్రం (అమరవాడ), ఉత్తరాఖండ్ రాష్ట్రం (బద్రీనాథ్, మంగళూరు), పంజాబ్ రాష్ట్రం (జలంధర్ వెస్ట్), హిమాచల్ ప్రదేశ్ (డెహ్రా, హమీర్పూర్, నలగర్) అసెంబ్లీ నియోజకవర్గాలకు జూలై 10న పోలింగ్ జరగనుంది.




## బస్సుపై ముష్కరుల దాడి..

### తమ పనేనని ప్రకటించిన ఉగ్రవాద సంస్థ

**విశ్వంభర, కశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదులు రెచ్చిపోయారు. ఆదివారం రియాసి జిల్లాలో యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై కాల్పులు జరిపారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 10మంది యాత్రికులు మృతిచెందగా 33మందికి గాయాలయ్యాయి. తాజాగా ఈ దాడికి పాల్పడింది తామేనని పాక్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ద రెసిస్టంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. గతంలోనూ ఈ ఉగ్రవాదులు రాజౌరీ, పూంఛ్, రియాస్‌లలో ఎత్తైన కొండ ప్రాంతాల్లో చెట్ల పొదలమాటున దాక్కొని ఈ తరహా దాడులు చేశారు. తాజా కాల్పులు ఘటనలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కాగా, బస్సులోని ప్రయాణికులంతా ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని, మృతులను ఇంకా గుర్తించలేదని పోలీసులు చెప్పారు. గతేడాది జనవరి 6న ద రెసిస్టెన్స్ ఫ్రంట్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. దానిని ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మేరకు నిర్ణయం తీసుకున్నది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆన్‌లైన్ సంస్థ ఏర్పాటైంది. ఇది పాకిస్థాన్‌లోని కరాచీ కేంద్రంగా పనిచేస్తున్నట్లు జాతీయ మీడియా వెల్లడించింది. కాగా, లష్కరే తోయిబా, తెహ్రీక్ ఈ మిలిటెంట్ ఇస్లామియా, ఘజ్నవి హింద్ సంస్థల కలయికే టీఆర్ఎఫ్ కాగా, ఆ సంస్థకు ఎటువంటి మతపరమైన ఉద్దేశాన్ని కట్టబెట్టవద్దనే ఆలోచనతో టీఆర్ఎఫ్ అని నామకరణం చేసినట్లు తెలుస్తోంది.

## ఎయిర్ పోర్ట్‌లో 45 కిలోల బంగారం స్వాధీనం

**విశ్వంభర, చెన్నై:** బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రోజుకో కొత్త మార్గంలో గోల్డ్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. అధికారులే కంగుతినేలా వినూత్న రీతిలో బంగారాన్ని దాచి దేశాలు దాటిస్తున్నారు. మరో వైపు అధికార యంత్రాంగం సైతం అదే స్థాయిలో నిఘా ఏర్పాటు చేసింది. ఎక్కడికక్కడ బంగారం అక్రమ రవాణాను బట్టబయలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశంలో భారీగా బంగారం పట్టుబడింది.. రెండు వేర్వేరు విమానాశ్రయాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.27 కోట్ల విలువైన 45 కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఈ మేరకు రెండు ఘటనల్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం కస్టమ్స్ అధికారులు ఓ సిబ్బంది నుంచి 13 కేజీల 24 క్యారెట్ల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు, విమానాశ్రయ సిబ్బంది, ట్రాన్సిట్ ప్రయాణీకులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో కస్టమర్ సపోర్ట్ స్టాఫ్‌గా పనిచేస్తున్న మహ్మద్ బర్కతుల్లా అనే వ్యక్తిని ఇంటెలిజెన్స్‌తో చెన్నై విమానాశ్రయంలో అడ్డుకున్నారు. అతడి వద్ద నుంచి ఎయిర్‌పోర్టు డిపార్చర్ గేట్ వద్ద సోదాలు నిర్వహించి రబ్బర్ పేస్ట్ రూపంలో ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద నుంచి పేస్ట్ రూపంలో ఉన్న 36 పౌచులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ రూ.8.04 కోట్లుగా అంచనా వేశారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు.



## మాల్దీవుల అధ్యక్షుడితో కేంద్ర మంత్రి జైశంకర్ భేటీ

**విశ్వంభర, ఢిల్లీ:** మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుని కేంద్ర మంత్రి జైశంకర్ కలిశారు. మోదీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కేంద్రం ఆహ్వానం మేరకు భారత్‌కు వచ్చిన ముయిజ్జుతో జైశంకర్ సోమవారం భేటీ అయ్యారు. ఈ మేరకు రెండు దేశాల మధ్య సత్సంబంధాలపై ఇరువురూ చర్చించుకున్నట్లు సమాచారం. మరోవైపు ముయిజ్జుతో సమావేశమైనట్లు జైశంకర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. "ఈ రోజు న్యూఢిల్లీలో మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజ్జును కలుసుకోవడం ఆనందంగా ఉంది. మాల్దీవులతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాము" అంటూ ట్వీట్ చేశారు.

## రైతులకు అలెర్ట్.. వీరికి పీఎం కిసాన్ డబ్బులు రావు..!

**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరింది. మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఆయన ప్రధాని అయిన తర్వాత మొదటి సంతకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బుల విడుదలపై చేశారు. దాంతో 17వ విడతగా రూ.20 వేల కోట్లు విడుదలయ్యాయి. అయితే ఈ సారి కొందరు రైతులకు ఈ డబ్బులు అందవని కేంద్రం స్పష్టం చేసింది. ఈ కేవైసీ చేయించుకోని రైతులకు డబ్బులు వేయబోమని తెలిపింది. దాంతో పాటు బ్యాంకు ఖాతాను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయకుంటే వాయిదా ఆగిపోతుంది. ఈ కేవైసీ చేయించుకోవాలని ఇప్పటికే కేంద్రం చాలా సార్లు స్పష్టం చేసింది. వీరికి ఇచ్చే డబ్బులను ఆపేస్తున్నట్టు కేంద్రం స్పష్టం చేసింది. కాబట్టి ఈ విడత డబ్బులు రావాలంటే మాత్రం కచ్చితంగా రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని కేంద్రం తెలుపుతోంది.

# రాష్ట్రానికి పెద్ద దిక్కు బాబే

- ఆయన ప్రమాణ స్వీకార ముహూర్తం అత్యద్భుతం
- రాష్ట్రాన్ని గొప్పగా పరిపాలించాలి
- ఏ ప్రభుత్వం వచ్చినా ఉన్నది ఉన్నట్టు మాట్లాడతాం
- శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి



**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీలో ఎన్డీఏ కూటమి గెలువడంపై విశాఖపట్నం శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న ముహూర్తం అత్యద్భుతంగా ఉందని, సింహ లగ్నమని, ప్రజలకు నచ్చే విధంగా పరిపాలన చేయాలని ఆశీర్వదిస్తున్నానన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో నూతన ప్రభుత్వాలు ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. అమ్మ వారి కృప చేత నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయడం ఆనందం కలిగించిందన్నారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఉంది కాబట్టి ఆంధ్ర రాష్ట్ర బావుండాలని తాము కూడా యాగాలు చేస్తున్నామన్నారు. తనకు అత్యంత ఆత్మీయుడు ఆయిన ఎర్రన్నాయుడు కుమారుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర కేబినెట్ మంత్రి కావడం సంతోషంగా ఉందన్నారు.ఇది తెలుగు వారికి దక్కిన గౌరవమన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఉన్నది ఉన్నట్టు మాట్లాడతానని, సంపాదించుకోవాలి, దోచుకోవాలని అనుకునే పీఠం కాదన్నారు.

### చంద్రబాబు అనుభవం కలిగిన వ్యక్తి

తాను చంద్రబాబుని కొత్తగా పొగుడుతున్నానని అనుకోవద్దని, తన వ్యక్తిత్వం పెద్దలకు బాగా తెలుసన్నారు స్వరూపానంద. చంద్రబాబు గెలవాలని గతంలో మురళీమోహన్‌తో కలిసి సాధువులందరితో కలిసి సమావేశం పెట్టి పూజలు చేశామని.. ఎవరికీ భయపడి ఈ ప్రెస్ మీట్ పెట్టడం లేదన్నారు. తప్పుడు అభిప్రాయాలు వెల్లడించకుండా ప్రెస్ మీట్ పెడుతున్నామని.. చంద్రబాబు అంటే చాలా గౌరవం, చాలా సీనియర్ నేత అన్నారు. ఆయన ఆరోగ్యం బావుండాలి, ఈ సారైనా దేవాలయాల పాలన బావుండాలి అన్నారు. అమరావతిలో సైతం శారద పీఠం కోసం స్థలం కొనుగోలు చేశామని.. అక్కడ కూడా శారదా పీఠం నిర్మిస్తామన్నారు. ప్రమాణ స్వీకారం రోజున ఆంధ్ర రాష్ట్రం బాగుండాలని కోరుతూ తాము కూడా యాగాలు చేస్తున్నాం అన్నారు. ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజలు బాగుండాలనేది తమ ఆకాంక్ష అని.. చంద్రబాబు పరిపాలన అనుభవం కలిగిన వ్యక్తి అన్నారు స్వరూపానంద. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా.. ఎవరు తమ వద్దకు వచ్చినా.. తాము ఉన్నది ఉన్నట్టుగానే మాట్లాడతామని, దూరమైనా పర్వాలేదని శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు.



## బాబుకు బీజేపీ రెండు కుక్క బిస్కెట్లు వేసింది : కేఏ పాల్

**విశ్వంభర, విశాఖపట్నం:** కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువు దీరింది. ఇందులో టీడీపీ పార్టీకి రెండు కేంద్ర మంత్రి పదవులు దక్కాయి. ఇటు ఏపీలో కూడా త్వరలోనే ఎన్డీయే ప్రభుత్వం కొలువు దీరబోతోంది. ఈ క్రమంలో తాజాగా ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏపాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన ట్విట్టర్ లో ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. తాను చంద్రబాబు, పవన్ కల్యాణ్ ను ఇండియా కూటమిలో చేరమని చెప్పానని.. అలా చేసి ఉంటే ప్రధాని పదవితో పాటు రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ కూడా వచ్చి ఉండేదని.. కానీ వారు వినలేదని తెలిపారు. చంద్రబాబు బీజేపీ మాయలో పడ్డారని చెప్పారు. చంద్రబాబుకు బీజేపీ రెండు కేంద్ర మంత్రి పదవులను కుక్క బిస్కెట్ల రూపంలో వేసిందని.. దాంతో వెంటనే చంద్రబాబు మోడీకి సపోర్ట్ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ చంద్రబాబుకు నిజాయితీ ఉంటే.. స్పెషల్ స్టేటస్ ఇచ్చే వరకు కేంద్ర మంత్రి పదవులు తీసుకోకుండా చూడాలని.. అప్పుడే అనుకున్నది సాధ్యం అవుతుందని తెలిపారు.



## విడదల రజినిపై శ్రీరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, చిలకలూరిపేట:** వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని గురించి దాదాపు అందరికీ తెలిసే ఉంటుంది. ఆమె టీడీపీలో ఉన్నప్పుడు అభివృద్ధి అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటే అభివృద్ధి అని బహిరంగ సభలో వ్యాఖ్యానించిన రజిని.. వైసీపీలో చేరిన తరువాత అవకాశాన్ని సృష్టించుకుని మరీ టీడీపీపై విమర్శల జల్లు కురిపించారు. అయితే తాడును తన్నే వాడు ఉంటే వాడి తలను తన్నే వాడు ఉంటాడని, మనం ఇతరులకు ఏం ఇస్తే మనకు తిరిగి అదే వస్తుందని పెద్దలన్న మాట మరోసారి రజిని విషయంలో ఋజువైందని పలువురు పేర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఫైర్ బ్రాండ్ శ్రీ రెడ్డి విడదల రజినిపై X వేదికగా బూతులు పురాణం వల్లించారు. మాజీ మంత్రి అయినటువంటి విడదల రజినిని వ్యాంక్గా శ్రీరెడ్డి సంబోధించారు. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి గెలుపుకోసం వైసీపీ ప్రయత్నించిందని సోషల్ మీడియా న్యూస్ చానెల్లో చూపించారని, దీనికి కారణం విడదల రజినిని వెంట పెట్టుకుని తిరగడమే అని మండిపడ్డారు. రజినిని చెత్తతో పోల్చిన శ్రీ రెడ్డి.. రజినిని పక్కన పెట్టుకుంటే ఇలా జరుగుతుందని తాను ఈ విషయం ఎప్పుడో చెప్పానని పేర్కొన్నారు.

# రాజకీయాలకు కేశినేని నాని గుడ్ బై

- ఓటమి నేపథ్యంలో సంచలన నిర్ణయం
- ఎక్స్ వేదికగా ప్రకటించిన నాని
- రెండు సార్లు ఎంపీగా సేవ చేయడం గొప్ప గౌరవం
- విజయవాడ అభివృద్ధి కృషి చేస్తా



**విశ్వంభర, విజయవాడ:** విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. ఈ విషయాన్ని సోమవారం ఎక్స్ వేదికగా కేశినేని ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన వైసీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఈ క్రమంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎక్స్ ఖాతాలో.. రెండు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి విజయవాడ ప్రజలకు సేవ చేయడాన్ని ఓ గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కేశినేని నాని అన్నారు. విజయవాడ నియోజకవర్గ ప్రజల స్థైర్యం, దృఢసంకల్పం తనకు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. వారు ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. తాను రాజకీయ రంగానికి దూరమవుతున్నప్పటికీ విజయవాడ అభివృద్ధి పట్ల తన నిబద్ధత ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. విజయవాడకి తాను చేయగలిగినది చేస్తూనే ఉంటానని చెప్పారు. తన రాజకీయ ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. తన జీవితంలో కొత్త అధ్యాయం వైపుగా పయనిస్తున్నానని, ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలను తనతో తీసుకువెళుతున్నానని అన్నారు. విజయవాడ అభివృద్ధి, శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న కొత్త ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు చెబుతున్నానని తెలిపారు. విజయవాడ ప్రజలకు పదేళ్లపాటు సేవ చేసే గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు మరోసారి వారికి కృతజ్ఞతలు చెబుతున్నానని కేశినేని నాని పేర్కొన్నారు.



## నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పవన్ కల్యాణ్

**విశ్వంభర, విశాఖపట్నం :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం ప్రధాని మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి సతీసమేతంగా హాజరైన సంగతి తెలిసిందే. సోమవారం ప్రత్యేక విమానంలో సీఎం రమేష్‌తో కలిసి ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్నారు. అక్కడి నుంచి అనకాపల్లి గవరపాలెం నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్నారు. ఎన్నికల ముందు అనకాపల్లిలో జరిగిన బహిరంగ సభలో గెలిచిన వెంటనే నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తానని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇవాళ అమ్మవారిని దర్శించుకుని పవన్ కల్యాణ్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పవన్ పిఠాపురం బయలుదేరారు. పిఠాపురంలో పార్టీ నేతలతో కీలక సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ – జనసేన నేతల మధ్య నెలకొన్న అసంతృప్తుల నేపథ్యంలో పవన్ వారితో సమావేశం కానున్నట్లు సమాచారం. ఇరు పార్టీ నేతలతో జనసేనాని మాట్లాడనున్నారు. ఇదిలా ఉండగా.. పవన్ కల్యాణ్ మంత్రి పదవిని తీసుకుంటారా? ఒకవేళ తీసుకుంటే ఏ శాఖను ఎంచుకుంటారు? అనేది అత్యంత చర్చనీయాంశంగా మారింది. పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎంతో పాటు మరో కీలక మంత్రి పదవి అప్పజెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చనడుస్తోంది.




# జగన్ ఓటమికి కారణం చెప్పిన మందుబాబు..

### వైరల్ అవుతున్న వీడియో



**విశ్వంభర, రాజమండ్రి:** ఏపీలో వైసీపీ ఓటమికి గల కారణాలను ఒక్కొక్కరు ఒక్కో విధంగా విశ్లేషిస్తున్నారు. పథకాలు ఎన్ని అమలు చేసినా ఇలా జరిగిందేంటీ అని వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. తమ ఓటమికి కారణాలు వెతికేపనిలో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా మరీ 11సీట్లకు పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అందులోనూ జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపొందడంతో వారి మనోవేదనను వర్ణించలేనిది. అయితే, కూటమి అధికారంలోకి రావడానికి కొందరు జగన్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని చెబుతున్నారు. ఈ క్రమంలో ఓ మందుబాబు వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. జగన్ మహిళలను ప్రాధాన్యత ఇచ్చి పథకాలను అమలు చేశారని అందుకే ఆయన ఓడిపోయారని తెలిపాడు. అదే మగ వారికి మంచిమందు ఇస్తే పరిస్థితి వేరేలా ఉండేదని చెప్పుకొచ్చారు. ఆ వీడియోలో 'జగనన్నా.. నా అక్కచెల్లెళ్లు ఓటేస్తారని చెప్పి అమ్మఒడి ఇచ్చావ్.. చేయూత ఇచ్చావ్.. చేదోడు ఇచ్చావ్.. కాపు నేస్తం ఇచ్చావ్.. ఇన్నిచ్చినా వాళ్లు నీకేం ఇచ్చారు. చివరికి ఓటమినిచ్చారు. అదే మా మగవాళ్లకు నువ్వు మంచి మందు ఇచ్చిఉంటే ఇవాళ నువ్వు ఓడిపోయినా కనీసం 40 నుంచి 50 సీట్లు ఇచ్చేవాళ్లం. నువ్వు ఆడవాళ్లను నమ్మడం వల్లే కేవలం 10సీట్లకే మిగిలిపోయావ్ అన్నా..' అంటూ చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఏపీ ప్రభుత్వంలో ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులు..?



**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీలో ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం కొలువు దీరింది. చంద్రబాబు సీఎం అని ఇప్పటికే ప్రకటించారు. దాంతో ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎవరికి ఎన్ని పదవులు అనేది అందరికీ ఆసక్తిగా మారిపోయింది. ఇప్పుడు టీడీపీకి సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ సీట్లు వచ్చాయి. అయినా సరే కూటమి పార్టీలను కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. అయితే ఏపీ ప్రభుత్వంలో సీఎంతో కలిపి 26 మంది మంత్రులకు మించి ఉండొద్దు. దాంతో ఇప్పుడు టీడీపీకి చంద్రబాబుతో కలిపి 20 మంత్రి పదవులు రాబోతున్నట్టు తెలుస్తోంది. ఇక జనసేనలో ఇప్పుడు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారు కూడా 5 మంత్రి పదవులు ఆశిస్తున్నట్టు చెబుతున్నారు. కాగా ఇక బీజేపీకి ఒక మంత్రి పదవి కేటాయించే అవకాశం ఉంది. దీనిపై నేడు క్లారిటీ రాబోతోంది. అయితే పవన్ కల్యాన్ కు ఈ సారి డిప్యూటీ సీఎం పదవి వస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో జాతీయ మీడియాతో ఆయన ఈ పదవి తీసుకోవడానికి సుముఖంగానే ఉన్నట్టు చెప్పారు.

# వైసీపీపై రూ.30కోట్ల పందెం కాసిన వ్యక్తి ఆత్మహత్య



**విశ్వంభర, నూజివీడు:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అత్యధిక స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వ ఏర్పాటుకు సద్ధమవుతోంది. అయితే, ఎన్నికల వేళ వైసీపీ గెలుస్తుందని చాలా మంది బెట్టింగ్ వేసినట్లు తెలుస్తోంది. ఓ వ్యక్తి వైఎస్సార్సీపీ గెలుస్తుందని ఏకంగా రూ.30కోట్ల పందెం వేశాడు. అయితే ఆ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన ఏలూరు జిల్లాలో జరిగింది.దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పు దిగవల్లి గ్రామానికి చెందిన జగ్గవరపు వేణుగోపాల్ రెడ్డి భార్య సర్పంచ్. కాగా, వారు వైఎస్సార్సీపీ మద్దతుదారులు. సీఎం జగన్‌పై ఉన్న అభిమానంతో వేణుగోపాల్ రెడ్డి ఆయనే గెలుస్తారని అనుకున్నాడు. అదే నమ్మకంతో రూ.30కోట్ల పందెం కట్టాడు. అయితే, ఫలితాల రోజు వేణుగోపాల్ రెడ్డి తన ఊరి విడిచి వెళ్లిపోయాడు. అతడి జాడ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు తెలిసిన వారిని ఆరాతీస్తూ ఊరంతా వెతికారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ క్రమంలో వేణుగోపాల్ రెడ్డి తన పొలం వద్ద మామిడితోటలో అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## అంబటి రాంబాబు ఇంటి ముందు తెలుగు యువత ఆందోళన..!

**విశ్వంభర, గుంటూరు :** ఏపీలో రోజు రోజుకూ ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా వైసీపీ మాజీ మంత్రుల ఇంటి ముందు టీడీపీ కార్యకర్తల ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మొన్న గుడివాడలో కొడాలి నాని ఇంటి ముందు ఇలాగే ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత వల్లభనేని వంశీ ఇంటి ముందు కూడా ఇలాగే చేశారు. ఇప్పుడు తాజాగా అంబటి రాంబాబు ఇంటి ముందు కూడా ఇలాగే ఆందోళన నిర్వహించారు. గుంటూరులోని ఆయన ఇంటి వద్దకు తెలుగు యువత చేరుకుని ఆందోళన చేపట్టింది. పోలీసులు వద్దని అడ్డుకున్నా సరే వినలేదు. పోలీసులకు, తెలుగు యువతకు మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత అంబటి రాంబాబు ఫొటోకు బొట్టు పెట్టి, పూలమాల వేసి చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రావాలంటూ ఆహ్వానించారు. ఒక కుర్చీ మీద ఆయన ఫొటోను ఉంటి.. దానికి ఇలా చేశారు. దాంతో ఈ వార్త కాస్తా రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అవుతోంది. దీనిపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బాబాయ్‌ని చంపినట్టే జగన్ జనాన్ని చంపుతున్నారు...

- లోకేష్ సంచలన వ్యాఖ్యలు




**విశ్వంభర, అమరావతి :** బాబాయిని చంపినట్టే జగన్ జనాన్ని చంపుతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంచలన ఆరోపణలు చేశారు. జగన్ ఓడిపోయినా రక్త చరిత్ర రాస్తూనే ఉన్నారని మండిపడ్డారు. కర్నూలు లో టీడీపీ నేత గౌరీ నాథ్ ను వైసీపీ నేతలు దారుణంగా హత్య చేయించారని అన్నారు. ఈ పార్టీ ఫ్యాక్షన్ పాలన వద్దని ఎన్నికల్లో జనం ఛీకొట్టారని తెలిపారు. హత్యా రాజకీయాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గౌరీనాథ్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని లోకేష్ హామీ ఇచ్చారు. నిందితులను వదిలే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ దాడులకు చెక్ పెట్టి శాంతి భద్రతలను కాపాడతామని తెలిపారు.



## బాలయ్య బర్త్‌డే.. చంద్రబాబు స్పెషల్ విషెస్..!


**విశ్వంభర, అమరావతి :** టీడీపీ నేత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను ఇవాళ(సోమవారం) ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆయనకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'తెలుగు సినిమా రంగంలో అన్ స్టాపబుల్ అనిపించుకున్న అగ్రహీరో, హిందూపురం శాసనసభ్యులు, నా ఆత్మీయుడు నందమూరి బాలకృష్ణకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. సినీ, రాజకీయ రంగాల్లో తిరుగులేని ప్రజాదరణతో నిండు నూరేళ్ళు ఆనంద, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు. దీంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు ఈ ట్వీట్‌ను వైరల్ చేస్తున్నారు. ఈ ట్వీట్‌కు పలువురు అభిమానులు గతంలో చంద్రబాబుతో బాలయ్య దిగిన ఫొటోలను పోస్ట్ చేస్తున్నారు. అదేవిధంగా 'నా ముద్దుల బాలా మావయ్యకు జన్మదిన శుభాకాంక్షలు' అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.



## డిప్యూటీ సీఎం పదవి ఆశిస్తున్నఎమ్మెల్యే పవన్..

### ఇండియా టుడే ఇంటర్వ్యూలో వెల్లడి

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ఇప్పుడు ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. టీడీపీ సొంతంగానే మెజార్టీ సీట్లను సాధించుకుంది. కానీ కూటమి విజయంలో పవన్ కల్యాణ్ కీలకంగా వ్యవహరించారు. పవన్ ఇమేజ్ వల్లే కూటమి గెలిచిందనే ప్రచారం బలంగా ఉంది. అయితే ఇప్పుడు చంద్రబాబు కూటమి నుంచి సీఎం కాబోతున్నారు. దాంతో పవన్ కల్యణ్ కు డిప్యూటీ సీఎం పదవి ఖాయం అంటూ ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. దానిపై తాజాగా ఇండియా టుడే వెల్లడించింది. నిన్న అంటే ఆదివారం పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి వర్గ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి మీడియాతో.. డిప్యూటీ సీఎం పదవి తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేశారు. అదే విషయాన్ని ఇండియా టుడే వెల్లడించింది. ఈ నెల 12న ఏపీ కొత్త సీఎం మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండబోతోంది. అయితే ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులు, డిప్యూటీ సీఎం ఎవరికి అనే దానిపై మంగళవారం నాడు ఎన్డీయే కూటమి సమావేశంలో క్లారిటీ రాబోతోంది. చూస్తుంటే కచ్చితంగా పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎం పదవి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.





## కోహ్లీ అవుట్ అవ్వగానే తెగ బాధపడ్డ అనుష్క..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇండియా– పాకిస్థాన్ మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగింది. తక్కువ స్కోర్‌కే అవుట్ అయిన ఇండియా.. ఆ తర్వాత పాకిస్థాన్ బ్యాట్స్ మెన్ కు చుక్కలు చూపించారు. కాగా స్టార్ క్రికెటర్ కోహ్లీ, అతని భార్యకి సంబందించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అనుష్క శర్మ , విరాట్ కోహ్లీ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. విరాట్ టీమ్ ఇండియా తరుపున అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రపంచకప్ ఆడుతున్నాడు. అనుష్క కూడా మ్యాచ్‌లను చూడటానికి అక్కడికి వెళ్ళింది. విరాట్ కోహ్లీ పాకిస్థాన్ తో ఆడిన మ్యాచ్ లో అంతగా పర్ఫామ్ చేయలేదు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు బంతుల్లో నాలుగు పరుగులు మాత్రమే చేశాడు. విరాట్ తొందరగానే ఔట్ కావడంతో అనుష్క శర్మ బాధపడింది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మైదానంలోకి అడుగుపెట్టగానే బౌండరీ బాదాడు. ఆ తర్వాత అవుట్ అయ్యాడు. దీంతో విరాట్ కోహ్లీ అభిమానులు విషాదంలో మునిగిపోయారు. అనుష్క శర్మ కూడా చాలా బాధపడింది. ఈ ఫోటో, వీడియో వైరల్‌గా మారాయి. టాస్ గెలిచిన పాకిస్థాన్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. భారత జట్టు ఆశించిన స్కోరు చేయలేకపోయింది. 19 ఓవర్లలో 119 పరుగులు చేసి ఆలౌట్ అయింది. పాకిస్థాన్‌కు మంచి ఆరంభం లభించింది. అయితే చివరికి 113 పరుగులు మాత్రమే చేయగలిగింది. దాంతో టీమిండియా మంచి విజయాన్ని అందుకుంది.



## భారత్ క్రికెట్‌లో విషాదం.. ఎంసీఏ అధ్యక్షుడు హఠాన్మరణం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత క్రికెట్ లో తీవ్ర విషాదం నెలకొంది. ముంబై క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అమోల్ కాలే గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. టీ 20 ప్రపంచకప్ లో భాగంగా భారతదేశం, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ చూడటానికి అమోల్ కాలే ఆదివారం న్యూయార్క్ వెళ్లారు. మ్యాచ్‌ని వీక్షించి సహచరులతో కలిసి స్టేడియం నుంచి తిరిగి వస్తుండగా గుండెపోటుతో అమోల్ కాలే మృతి చెందినట్లు సమాచారం. ఈ మేరకు పలువురు ప్రముఖులు కాలే ఆకస్మిక మృతికి సంతాపం తెలియజేస్తున్నారు. మహారాష్ట్ర ప్రతిపక్ష నేత జితేంద్ర అహ్వాద్ అమోల్ కాలే మృతికి సంతాపం తెలిపారు. 'ముంబై క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అమోల్ కాలే గొప్ప నిర్వాహకుడు. క్రికెట్ ప్రేమికుడు. ప్రపంచానికి వీడ్కోలు చెప్పే వయసు నీకు రాలేదు. ఇది నాకు వ్యక్తిగత నష్టం' అని తన ట్విట్టర్ వేదికగా నివాళులు అర్పించారు.




## పేటీఎంలో ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు..

విశ్వంభర, బిజినెస్ : ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తన ఉద్యోగులకు పింక్ స్లిప్స్ పంపిణీ చేసింది. ఎంత మంది ఉద్యోగులను సాగనంపిందన్న సంగతి తెలియదు కానీ, ఉద్యోగులను తొలగించినట్లు పేటీఎం ధృవీకరించింది. ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఇతర సంస్థల్లో ఉపాధి కల్పనకు సాయ పడుతున్నట్లు పేటీఎం చెబుతున్నట్లు పీటీఐ ఓ వార్తా కథనం ప్రచురించింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాజీనామా చేసిన ఉద్యోగులకు కొత్త ఉద్యోగాల కల్పనకు 30 సంస్థలతో కలిసి తమ హెచ్‌ఆర్ విభాగం పని చేస్తున్నదని పేటీఎం వెల్లడించింది. ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్న నేపథ్యంలో ఉద్యోగులందరికీ బోనస్ కూడా విడుదల చేసింది. ఉద్యోగుల తొలగింపు విషయమై తాము అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు పేటీఎం తెలిపింది. సంస్థ సేల్స్ డివిజన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 3500 మంది తగ్గారు. మార్చి నెలాఖరు నాటికి పేటీఎంలో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 3,6521 మంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ సర్వీసులపై ఆర్బీఐ ఆంక్షలు విధించినప్పటి నుంచి పేటీఎం నష్టాలు పెరిగాయని తెలుస్తున్నది. నియంత్రణాపరమైన నిబంధనలు పాటించడం లేదని తమ తనిఖీలో తేలడంతో మార్చి 15 తర్వాత కొత్తగా ఖాతాలు ప్రారంభించొద్దని, వాలెట్లు, ఫాస్టాగ్ చెల్లింపులు జరుపొద్దని కస్టమర్లను ఆర్బీఐ ఆదేశించింది. ఆర్బీఐ నిషేధం తర్వాత 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో పేటీఎం నష్టాలు రూ.550 కోట్లకు పెరిగాయి. అంతకుముందు ఏడాది 2022–23 నాలుగో త్రైమాసికంలో పేటీఎంకు రూ.167.5 కోట్ల నష్టాలు మాత్రమే వచ్చాయి.

# ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-3 కొత్త లోగో ఆవిష్కరణ

- మన ఆంధ్ర-మన ఏపీఎల్ ట్యాగ్ లైన్‌తో మ్యాచ్
- గల్లీ నుంచి రాష్ట్ర స్థాయికి తీసుకువచ్చే గేమ్
- జూన్ 30 నుంచి జూలై 13 వరకు మూడో సీజన్
- క్రికెటర్లు కేఎస్ భరత్, నితీశ్‌కుమార్, రికీ భుయ్ హాజరు




**విశ్వంభర, స్పోర్ట్స్ :** స్థానిక క్రికెటర్లను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నిర్వహిస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) మూడో సీజన్ రంగం సిద్ధమైంది. జూన్ 30 నుంచి జూలై 13 వరకు మూడో సీజన్ జరగనుంది. ఈ క్రమంలో సోమవారం ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–3 కొత్త లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రికెటర్లు కేఎస్ భరత్, నితీశ్‌కుమార్, రికీ భుయ్ లు పాల్గొని లోగోను ఆవిష్కరించారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–3 ప్రొఫెషనల్ గా సాగనుందని నిర్వాహకులు చెప్పారు. ఈ ప్రీమియం లీగ్ కి మన ఆంధ్ర–మన ఏపీఎల్ అనే ట్యాగ్ లైన్ తో తీసుకొని వస్తున్నట్లు వెల్లడించారు. గల్లిలో టాలెంట్ ఉన్న వారికి మంచి అవకాశం ఇచ్చి, రాష్ట్ర స్థాయికి తీసుకొని వస్తున్నామని, ఇప్పుడు లీగ్ మ్యాచ్ లు నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకున్నదని తెలిపారు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరుపున అదరగొట్టిన నితీశ్ రెడ్డి మాట్లాడుతూ.. తాను చాలా కింద స్థాయి నుంచి వచ్చినట్లు చెప్పాడు. ఆడటానికి మంచి అవకాశాలు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కల్పించిందన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్స్ చాలా ఫేమస్ అయ్యాయని, చాలా మంది దీని గురించి అడిగినట్లు చెప్పారు. రంజీ ప్లేయర్ కే ఎస్ భరత్ మాట్లాడుతూ.. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ చాలా సీరియస్ గా తీసుకున్నట్లు వెల్లడించాడు. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్స్ కి ఇది మంచి అవకాశన్నాడు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ లో భాగం కావడం చాలా ఆనందంగా ఉందన్నాడు.

# 'ట్రాక్టర్ అమ్మి టికెట్ కొన్న భయ్యా.. గుండె బద్దలైంది'

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం (జూన్ 09) జరిగిన ఇండియా వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన మజాను అందించింది. న్యూయార్క్ వేదికగా జరిగిన ఈ లో స్కోరింగ్ థ్రిల్లింగ్ మ్యాచ్ లో టీమిండియా ఆరు పరుగులు తేడాతో పాకిస్తాన్ పై విజయం సాధించింది. కాగా ఈ హై–వోల్టేజ్ మ్యాచ్ సందర్భంగా, అభిమానులు స్టేడియంలో కిక్కిరిసిపోయారు. స్థానిక క్రికెట్ అభిమానులతో పాటు భారత్, పాక్ లకు చెందిన వేలాది మంది ఈ మ్యాచ్ కు హాజరయ్యారు. ఇలా వెళ్లిపోయిన పాకిస్థాన్ అభిమానులకు మరోసారి నిరాశే ఎదురైంది. ఎందుకంటే టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు చేతిలో భారత జట్టు 7వ సారి ఓడిపోయింది. ఈ ఓటమి తర్వాత ఓ పాక్ అభిమాని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ఎందుకంటే ఈ మ్యాచ్ చూసేందుకు ఒక పాక్ అభిమాని ఏకంగా తన ట్రాక్టర్ అమ్మేసి న్యూయార్క్ వచ్చాడు. 3000 డాలర్ల విలువైన టికెట్ కూడా కొన్నాడు. అంటే పాక్ కరెన్సీలో సుమారు రూ.8 లక్షలు కాగా అదే ఇండియన్ కరెన్సీలో సుమారు రూ. 2.50 లక్షలు.




### ఇలా జరుగుతుందను కోలేదు..

ఇంత ఖరీదైన టికెట్ కొని మ్యాచ్ వీక్షించిన అభిమాని కనీసం ఈసారి అయినా పాక్ జట్టు గెలుస్తుందన్న గట్టి నమ్మకంతో ఉన్నాడు. అందుకు తగ్గట్టుగానే మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు కేవలం 119 పరుగులకే ఆలౌటైంది. దీంతో పాక్ జట్టు విజయం ఖాయమని సదరు అభిమాని భావించారు. కానీ టీమ్ ఇండియా బౌలర్ల ధాటికి పాకిస్థాన్ బ్యాటర్లు మోకరిల్లారు. ఈ ఓటమి బాధ గురించి పాక్ అభిమాని మాట్లాడుతూ, "నేను US $ 3000 విలువైన టికెట్ కొనడానికి నా ట్రాక్టర్‌ని అమ్మాను. భారత జట్టు స్కోరు చూస్తుంటే ఈ మ్యాచ్‌లో ఓడిపోతామని అనుకోలేదు. మ్యాచ్ మొత్తం మా చేతుల్లోనే ఉంది. కానీ బాబర్ అజామ్ ఔట్ అయిన తర్వాత ప్రజలు నిరాశ చెందారు.. మీ అందరికీ (భారతీయులు) నేను అభినందనలు తెలుపుతున్నాను" అని పాకిస్థాన్ అభిమాని భావోద్వేగానికి లోనయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. క్రికెట్ అభిమానులు, నెటిజన్లు ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు.

# అమెరికాలో బ్యాటింగ్‌కు సహకరించని పిచ్‌లు



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ లు జరుగుతున్న అమెరికాలో పిచ్ లు బ్యాట్స్ మన్లకు ఏమాత్రం అనుకూలించడం లేదు. ఈ డ్రాప్ ఇన్ పిచ్ లపై 150 పరుగులు చేస్తే చాలా గొప్ప విషయం. ఇవాళ బంగ్లాదేశ్ తో మ్యాచ్ లో దక్షిణాఫ్రికా కూడా బ్యాటింగ్ చేసేందుకు ఆపసోపాలు పడింది. భారీ హిట్టర్లతో కూడిన ఆ జట్టు న్యూయార్క్ స్టేడియం పిచ్ పై తేలిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 113 పరుగులు చేయగలిగింది. క్లాసెన్ 46, డేవిడ్ మిల్లర్ 29 పరుగులు చేయడంతో సఫారీలకు ఆ మాత్రం స్కోరైనా వచ్చింది. డికాక్ 18, రీజా హెండ్రిక్స్ 0, కెప్టెన్ మార్ క్రమ్ 4, ట్రిస్టాన్ స్టబ్స్ 0 పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజీమ్ హసన్ సకిబ్ 3, తస్కిన్ అహ్మద్ 2, రిషాద్ హుస్సేన్ 1 వికెట్ తీశారు.

### డ్రాప్ ఇన్ పిచ్ అంటే...!

సాధారణంగా క్రికెట్ స్టేడియంలోనే పిచ్ లను తయారుచేస్తుంటారు. ప్రత్యేకమైన మట్టిని కొన్ని పొరలుగా రూపొందించి పిచ్ తయారు చేస్తారు. దాన్ని నిత్యం నీళ్లతో తడుపుతూ, రోలర్ తో చదును చేస్తూ ఉంటారు. దానిపై పెరిగిన గడ్డిని కత్తిరిస్తూ, మ్యాచ్ కు అనువుగా తీర్చిదిద్దుతారు. అయితే, డ్రాప్ ఇన్ పిచ్ లను స్టేడియంలో కాకుండా... బయట ఎక్కడో ఒక భారీ స్టీల్ ట్రేలో రూపొందిస్తారు. మట్టి, బంకమన్ను మిశ్రమాన్ని స్టీల్ ట్రేలో 22 గజాల పొడవునా పిచ్ రూపంలో మలిచి, దానిపై గడ్డిని పెంచుతారు. ఒక్కసారి ఆ పిచ్ బిగిసిన తర్వాత... ఆ స్టీల్ ట్రేను తొలగించి ఆ పిచ్ ను స్టేడియంలో అమర్చుతారు. వీటినే డ్రాప్ ఇన్ పిచ్ లు అంటారు. ఇవి స్పందించే తీరును అంచనా వేయడం కష్టమైన పనే. ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్ లో జరుగుతున్నది ఇదే. ఈ తరహా పిచ్ లపై హేమాహేమీ జట్లు కూడా 100 పరుగులు చేయడానికి చెమటోడ్చుతున్నాయి.



పాక్ పై భారత్ విజయం..

## న్యూయార్క్ పోలీసులకు ఢిల్లీ పోలీసుల ట్వీట్..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** న్యూయార్క్‌లోని నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో పాక్ పై భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రోహిత్ సేనతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారత అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. భారత్ గెలుపుతో పాకిస్తాన్ సూపర్ 8 ఆశలు సంక్లిష్టంగా మారాయి. అదే సమయంలో టీమ్‌ఇండియా సూపర్8కి మరింత చేరువైంది. పాక్ పై విజయంతో సంబురాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో భారత విజయం పై ఢిల్లీ పోలీసులు చేసిన ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియా వైరల్‌గా మారింది. 'మేము రెండు శబ్దాలను విన్నాము.. అందులో ఒకటి ఇండియా.. ఇండియా.. రెండోది బహుశా టీవీలను పగలగొట్టిన సౌండ్ కావొచ్చు.. దయచేసి మీరు దీన్ని నిర్ధారించగలరా.' అంటూ న్యూయార్క్ పోలీసులను ట్యాగ్ చేసింది. ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. కాగా.. భారత్ పై పాకిస్తాన్ ఓడిపోతే గతంలో కొందరు అభిమానులు తమ టీవీలను పగలగొట్టిన సంగతి తెలిసిందే. న్యూ యార్క్‌లోని నాసావు కౌంటీ స్టేడియంలో మ్యాచ్ ముగిసిన తర్వాత, త్రివర్ణ పతాకం ప్రకాశవంతంగా ఎగురడంతో వేదిక వద్ద ఉన్న అభిమానులు డ్రమ్స్ వాయిస్తూ ఆనందంతో నాట్యం చేశారు. భారత ఆటగాళ్ల ప్రదర్శన పట్ల టీమ్‌ఇండియా సూపర్ ఫ్యాన్ అయిన సుధీర్ కుమార్ చౌదరి ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు.




## టీమిండియా జెర్సీలో మైక్రోసాఫ్ట్ బాస్..

### ఇండో-పాక్ మ్యాచ్ వీక్షించిన సత్య నాదెళ్ల!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం న్యూయార్క్ వేదికగా జరిగిన దాయాదుల పోరును మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రేక్షకుల గ్యాలరీలో ఉన్న సత్య నాదెళ్ల .. ప్రముఖ వ్యాపారవేత్త గౌరవ్ జెయిన్‌తో సెల్ఫీ దిగారు. ఇండియన్ జెర్సీ ధరించిన మైక్రోసాఫ్ట్ సీఈఓ.. మ్యాచ్‌ను ఫుల్ ఎంజాయ్ చేశారు. క్రికెట్ అభిమానులతో కలిసి సత్య నాదెళ్ల దిగిన ఫోటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆయన ఫొటోకు 'ఎక్స్' (ట్విట్టర్) లో లక్షల వ్యూస్ వచ్చాయి. నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. కాగా, గతంలో క్రికెట్ పట్ల తనకు ఉన్న ఇష్టాన్ని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. టీమ్ వర్క్, లీడర్‌షిప్ వంటి వాటిని క్రీడల నుంచే నేర్చుకున్నట్లు తెలిపారు. క్రికెట్ ఆడడం వల్ల టీమ్‌లతో వర్క్ చేయడం నేర్చుకున్నట్లు గుర్తు చేశారు. ఇక న్యూయార్క్‌లోని నసావు కౌంటీ క్రికెట్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆరు పరుగుల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. అనంతరం 120 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన దాయాది పాకిస్థాన్ అనూహ్య రీతిలో పరాజయం పాలైంది.




## 3రోజుల వరుస లాభాలకు బ్రేక్

- ఎన్డీయే హ్యాట్రిక్‌తో స్టాక్ మార్కెట్లకు లాభాలు
- అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో లావాదేవీల మందగింపు
- స్వల్ప నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**విశ్వంభర, బిజినెస్ :** కేంద్రంలో మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో, భారత స్టాక్ మార్కెట్లు వరుసగా మూడు రోజుల పాటు జోరు ప్రదర్శించాయి. ఈ ఊపుకు నేడు తెరపడింది. దేశ రాజకీయ పరిణామాలు అందించిన ఉత్సాహంతో మూడ్రోజుల పాటు లాభాల్లో పయనించిన స్టాక్ మార్కెట్ సూచీలు నేడు అంతర్జాతీయ పరిణామాలతో ప్రభావితం అయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ స్వల్ప నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 203 పాయింట్ల నష్టంతో 76,490.08 వద్ద ముగియగా... నిఫ్టీ 30.95 పాయింట్ల నష్టంతో 23,259.20 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఈ ఉదయం ట్రేడింగ్ ఆరంభంలో 77,079.04 వద్ద రికార్డు గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్ కొనసాగే కొద్దీ లావాదేవీలు మందగించాయి. ఇవాళ్టి ట్రేడింగ్ లో అల్ట్రాటెక్ సిమెంట్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్ లాభాలు ఆర్జించగా... టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్ షేర్లు పతనమయ్యాయి.

# ఇక ఫాస్టాగ్స్‌కు గుడ్‌బై..




### టోల్ ప్లాజాల వద్ద కొత్త టెక్నాలజీ..

**విశ్వంభర, బిజినెస్ :** దేశంలో శాటిలైట్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ సేకరణను ప్రారంభించాలని భారత ప్రభుత్వం యోచిస్తోంది. ముందుగా వాణిజ్య వాహనాలకు దీన్ని అమలు చేయనున్నారు. దీని తరువాత, ఈ సాంకేతికత ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్‌లకు కూడా దశలవారీగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది కేంద్రం. రాబోయే రెండేళ్లలో అన్ని టోల్ కలెక్షన్ పాయింట్ల వద్ద ఈ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (GNSS)ని ఇన్‌స్టాల్ చేయడానికి ప్రణాళికలు జరుగుతున్నాయి. దీంతో ఫాస్టాగ్ సేవలు ముగియనున్నాయి.

**కొత్త టెక్నాలజీ కారణంగా** టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ నుండి ఉపశమనం ఉంటుంది. ఈ టెక్నాలజీ కింద వినియోగదారుడు తాను ప్రయాణించాల్సిన దూరాన్ని బట్టి టోల్ చెల్లించాల్సి ఉంటుంది. జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోల్ వ్యవస్థ అవరోధ రహిత ఎలక్ట్రానిక్ టోల్ సేకరణగా ఉంటుంది. దీనిలో వాహనం ప్రయాణించిన కిలోమీటర్ల సంఖ్యను గుర్తించడానికి వాహనం కదలికను ట్రాక్ చేయబడుతుంది.

**రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ** కింద పనిచేస్తున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, భారతదేశంలో GNSS ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ సేకరణ విధానాన్ని అమలు చేయడానికి ప్రపంచ కంపెనీలను ఆహ్వానించింది. ప్రతి టోల్ ప్లాజాలో GNSS వాహనాలను గుర్తించడానికి ముందస్తు రీడర్‌లతో రెండు లేదా అంతకంటే ఎక్కువ GNSS లేన్‌లు ఉంటాయి. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) లేన్‌లోకి ప్రవేశించే జీఎన్ఎస్ఎస్ కాని వాహనాలకు అదనపు ఛార్జీ విధిస్తారు. మొదటి మూడు నెలల్లో 2,000 కి.మీ జాతీయ రహదారులపై జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోలింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీని తర్వాత, వచ్చే తొమ్మిది నెలల్లో 10,000 కి.మీలకు, 25,000 కి.మీ టోల్ హైవేలకు, 15 నెలల్లో 50,000 కి.మీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఫాస్టాగ్ వ్యవస్థ ఉంది. ఇందులో ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (RFID) టెక్నాలజీని ఉపయోగించారు. ఇది 2015లో ఫాస్టాగ్ రూపంలో ప్రవేశపెట్టారు.

### నితిన్ గడ్కరీ గ్రీన్ సిగ్నల్..

కొన్ని రోజుల క్రితం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ప్రజలు టోల్ ప్లాజాల వద్ద పొడవైన క్యూలలో ఇరుక్కుపోతారని, చాలాసేపు వేచి ఉండవలసి ఉంటుందని చెప్పారు. దీన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కొత్త మార్గాన్ని కనిపెట్టింది. శాటిలైట్ టోల్ సిస్టమ్ త్వరలో ప్రారంభం కానుంది. బెంగుళూరు, మైసూర్, పానిపట్‌లలో దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా ఉపయోగిస్తున్నారు. దేశంలో ఈ ఏడాదిలోనే ఈ టోల్ విధానం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు.

# నందమూరి ఫ్యామిలీ నుంచి మరో హీరో..


వైవీఎస్ చౌదరి

విశ్వంభర, సినిమా : నందమూరి ఫ్యామిలీ నుంచి ఇప్పటికే అరడజనుకు పైగా హీరోలు సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చారు. వారిలో చాలా మంది సూపర్ సక్సెస్ను రుచి చూసి ఉన్నత శిఖరాలకు చేశారు. ఇక ఇప్పుడు ఈ ఫ్యామిలీ నుంచి మరో హీరో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఈ విషయాన్ని దర్శకుడు వైవీఎస్ చౌదరి అధికారికంగా ప్రకటించారు. తన భార్య గీత నిర్మాతగా న్యూ టాలెంట్ రోర్స్ అనే కొత్త బ్యానర్‌ను వైవీఎస్ ప్రారంభించారు. ఈ బ్యానర్‌పై రానున్న తొలి సినిమాతోనే నందమూరి ఫ్యామిలీ నుంచి నాలుగోతరం హీరోను పరిచయం చేస్తున్నట్లు ప్రకటించారు. 'సీనియర్ ఎన్టీఆర్ మునిమనవడు.. హరికృష్ణ మనవడు.. దివంగత జానకిరామ్ పెద్ద కుమారుడు నందమూరి తారక రామారావును నేను ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నందుకు గర్వంగా ఉంది. హరికృష్ణతో సినిమాలు తీసే అదృష్టం నాకు దక్కింది. ఇప్పుడు ఆయన మనవడిని కూడా ప్రపంచానికి పరిచయం చేయబోతున్నా' అని వైవిఎస్ చౌదరి ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో తెలుగుఅమ్మాయిని హీరోయిన్‌గా తీసుకోనున్నట్లు సమాచారం.

# 'ది ట్రయల్' నటి ఆత్మహత్య




విశ్వంభర, సినిమా: సినీ ఇండస్ట్రీలో మరో విషాదం చోటుచేసుకుంది. నటి నూర్ మాళబికా దాస్ (32) ఆత్మహత్యకు పాల్పడింది. ముంబైలోని ఆమె అపార్ట్‌మెంట్ నుంచి దుర్వాసన రావడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నూర్ మాళవికా దాస్ స్వస్థలం అసోం. ఆమె నటి కావడానికి ముందు ఖతార్ ఎయిర్‌వేస్‌లో ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసింది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న 'ది ట్రయల్' అనే వెబ్‌సిరీస్‌లో నటించిన ఆమె నటించింది. అయితే ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సివుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రముఖ నటి ఇంట్లో భారీ చోరీ

**విశ్వంభర, సినిమా :** ప్రముఖ నటి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఏకంగా 110గ్రాముల బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ప్రముఖ మరాఠీ నటి శ్వేత షిండే ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. ఏకంగా 110 గ్రాములు ఆభరణాలతో పాటు నగదును కూడా దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. శ్వేత షిండే ప్రస్తుతం మహారాష్ట్రలోని సతారాలో తల్లితో కలిసి ఈమె నివాసముంటోంది. ఇటీవల ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలుపడ్డారు. ఆ సమయంలో శ్వేత ముంబైలో ఉన్నట్లు తెలుస్తోంది. శ్వేత షిండే ప్రస్తుతం సినిమాలు, సీరియల్స్ చేస్తూ బిజీగా ఉంది. నిర్మాతగానూ పలు సీరియల్స్ తీస్తోంది. మహారాష్ట్రలోని సతారాలో తన తల్లితో కలిసి నివాసముంటోంది. అయితే జూన్ 3వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు 110గ్రాముల బంగారాన్ని, నగదును అపహరించుకెళ్లారు. అయితే, డబ్బు ఎంత పోయిందనేది తెలియాల్సివుంది. ఈ విషయం ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. శ్వేత 2007లో సందీప్ భన్సాలీ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. వీరికి ఓ కూతురు ఉంది. 2016లో నిర్మాతగా మారింది.


బాబీ-బాలయ్య మూవీ గ్లింప్స్ అదుర్స్..

# ఊర మాస్ పాత్రలో బాలయ్య..!

**విశ్వంభర, సినిమా :** సోమవారం నాడు నటసింహం బాలయ్య బర్త్ డే సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మొన్న ఎన్నికల్లో గెలిచిన తర్వాత వచ్చిన ఆయన మొదటి పుట్టిన రోజు ఇది. దాంతో ఇండస్ట్రీలో, రాజకీయాల నుంచి ఆయనకు చాలా మంది విషెస్ తో పాటు ప్రత్యేక గిఫ్ట్ లను ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు డైరెక్టర్ బాబీ మూవీ నుంచి మరో అద్భుతమైన గిఫ్ట్ ఇచ్చారు. బాలయ్య-బాబీ కాంబినేషన్ లో 109వ చిత్రం 'NBK109'తో పవర్ ఫుల్ సినిమా వస్తోంది. అయితే ఇప్పటికే చాలా వరకు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా నుంచి తాజాగా బాలయ్య పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో "జాలి, దయ, కరుణ లాంటి పదాలకు అర్థం తెలియని అసురుడు" అంటూ పవర్ ఫుల్ డైలాగ్ తో బాలకృష్ణ పాత్రను పరిచయం చేసిన తీరు అద్భుతంగా ఉంది. మాస్ ప్రేక్షకులకు ఏం కావాలో అన్నీ ఇందులో ఉన్నాయి. ఇక సినిమా ఏ రేంజ్ లో ఉంటుందో అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# స్టార్ హీరో కొడుకుతో శ్రీలీల రొమాన్స్!

విశ్వంభర, సినిమా : టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీగా మంచి పేరు తెచ్చుకుంది అందాల భామ శ్రీలీల . తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకొని కుర్రాళ్ళ ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. పెళ్లి సందడి సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా మారిపోయింది. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కు జోడీగా ఉస్తాద్ భగత్ సింగ్ అనే సినిమాలో నటిస్తుంది. ఇక ఈ అమ్మడు ఇప్పుడు బాలీవుడ్ కు చెక్కేయనుంది. బాలీవుడ్ లో సినిమా చేసేందుకు శ్రీలీల రెడీ అయ్యిందని టాక్ వినిపిస్తుంది. స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ తనయుడు హీరోగా పరిచయం కానున్న సినిమాతోనే శ్రీలీల కూడా బాలీవుడ్ కు పరిచయం కానుందని టాక్ వినిపిస్తుంది.





# బుల్లితెరమీదకు అనసూయ రీ ఎంట్రీ?

విశ్వంభర, సినిమా: బుల్లితెరపై అనసూయకు ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఆమె యాంకర్ గా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసింది. మరీ ముఖ్యంగా జబర్దస్త్ ప్రోగ్రామ్ ఆమెకు తిరుగులేని స్టార్ డమ్ ను తీసుకొచ్చింది. ఆ తర్వాత ఆమె వెనక్కు తిరిగి చూసుకోలేదు. కానీ ఎందుకో ఆ ప్రోగ్రామ్ మానేసింది. తర్వాత స్టార్ మాలో ఓ ప్రోగ్రామ్ చేసింది. కానీ అది మధ్యలోనే ఆగిపోయింది. అప్పటి నుంచి వరుసగా పెద్ద సినిమాల్లోనే నటిస్తూ ఫుల్ బిజీగా గడిపేస్తోంది. చాలా కాలంగా ఆమె బుల్లితెరకు దూరంగానే ఉంది. కానీ ఇప్పుడు తాజాగా ఆమె బుల్లితెరమీదకు ఎంట్రీ ఇచ్చింది. త్వరలో ప్రారంభం కాబోతున్న ఓ గేమ్ షో ప్రోమోలో అనసూయ కనిపించింది. కిరాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ పేరుతో స్టార్ మా ఓ ప్రోమో విడుదల చేసింది. ఇందులో అనసూయ, శేఖర్ మాస్టర్, అమర్ దీప్, ప్ఇరయాంక, శోభాశెట్టి, తేజ, విష్ణుప్రియ, రీతూ చౌదరి కనిపించారు. అంటే వీరితో ఒక కొత్త ప్రోగ్రామ్ స్టార్ట్ చేయబోతున్నారన్నమాట. దీనికి అనసూయనే యాంకరింగ్ చేస్తోందని తెలుస్తోంది.

# మీ నోటి నుంచి లాలాజలం కారుతుందా..?



చిన్నతనంలో నోటి నుంచి లాలాజలం కారడం చాలా సాధారణ విషయం. కానీ ఈ సమస్య పెరిగిన తర్వాత కూడా కొనసాగుతుంటే.. అది ఏదో ఒక వ్యాధికి సంకేతం కావచ్చంటున్నారు వైద్య నిపుణులు.. ఎందుకైనా మంచిది వైద్యులను కలవాలని సూచిస్తున్నారు. వాస్తవానికి పిల్లలు నిద్రపోతున్నప్పుడు.. నోటి నుంచి లాలాజలం వస్తుంటుంది.. బాల్యంలో నోటి కండరాలు బలహీనపడటం వల్ల ఇది జరుగుతుంది. ఈ సమస్య పెద్దలలో కూడా కనిపిస్తే.. అది ఆందోళన కలిగించే విషయం.. నిద్రిస్తున్నప్పుడు మీ నోటి నుండి లాలాజలం ప్రవహిస్తుంటే దానిని అస్సలు విస్మరించవద్దని సూచిస్తున్నారు వైద్య నిపుణులు.. దీని వెనుక 6 తీవ్రమైన కారణాలు ఉండవచ్చంటున్నారు. - విశ్వంభర, ఫీచర్

**మెదడు రుగ్మత:**
కొన్ని నాడీ సంబంధిత పరిస్థితులలో శరీరం కండరాలను సరిగ్గా నియంత్రించలేకపోతుంది. దీని వల్ల రాత్రిపూట నోటినుంచి లాలాజలం కారడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇందులో స్ట్రోక్ , పార్కిన్సన్స్ వ్యాధి, మల్టిపుల్ స్క్లెరోసిస్, డౌన్ సిండ్రోమ్ మొదలైనవి ఉన్నాయి.

**సంక్రమణ:**
శరీరంలో ఇన్ఫెక్షన్ కారణంగా లాలాజల సమస్య కూడా రావచ్చు. అటువంటి సందర్భాలలో గొంతు, సైనస్ ఇన్ఫెక్షన్, టాన్సిల్స్లిటిస్, పెరిటోన్సిలర్ చీము లాంటివి ఉన్నాయి.

**అలర్జీలు:**
నోటినుంచి లాలాజలం కారడానికి అలెర్జీ కూడా ఒక ముఖ్యమైన కారణం కావొచ్చు.. నిజానికి, అలెర్జీ విషయంలో, శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి లాలాజల గ్రంథి మరింత చురుకుగా మారుతుంది.


**ఆమ్లత్వం:**
నిత్యం ఎసిడిటీ సమస్యను ఎదుర్కొనే వారి నోటి నుంచి కూడా పెద్ద మొత్తంలో లాలాజలం ప్రవహించడం ప్రారంభమవుతుంది.

**గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి:**
ఒక వ్యక్తి తన గొంతులో ఏదో ఇరుక్కుపోయినట్లు అనిపించే పరిస్థితిని గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ అంటారు.. ఈ సమస్య కారణంగా నోటి నుండి లాలాజలం ప్రవహిస్తుంది.

**స్లీప్ అప్నియా:**
ఇది చాలా తీవ్రమైన నిద్ర సంబంధిత వ్యాధి.. దీని ప్రధాన లక్షణాలు నోటి నుండి లాలాజలం ప్రవహించడం.. ఇలాంటి పరిస్థితుల్లో కూడా లాలాజలం కారుతుంది. అయితే.. నిద్రలో లాలాజలం తరచూ ప్రవహిస్తుండటం.. ఇదే సమస్యను పదే పదే ఎదుర్కొంటుంటే వైద్యులను సంప్రదించడం మంచిది.

# ఖాళీ కడుపుతో 30 నిమిషాలు మార్నింగ్ వాక్ చేస్తే చాలు..

**మెరుగైన నిద్ర :**
మార్నింగ్ వాక్‌తో పగటిపూట చురుకుగా ఉండటం వల్ల మీరు సులభంగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. సూర్యరశ్మి సహజంగా మీ సిర్కాడియన్ రిథమ్‌ను ఏర్పాటు చేయడంలో సహాయపడుతుంది, ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. మీ దినచర్యకు 30 నిమిషాల మార్నింగ్ వాక్ జోడించడం వల్ల మీ మెదడు కార్యకలాపాలు పెరుగుతాయి. శారీరక శ్రమ మెదడుకు రక్త సరఫరాను పెంచుతుంది మరియు మీ అభిజ్ఞా పనితీరు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నడక వంటి మితమైన వ్యాయామం, కాలక్రమేణా జ్ఞాపకశక్తి నష్టం యొక్క ప్రభావాలను తగ్గించడానికి నిరూపితమైన మార్గం.




**విశ్వంభర, ఫీచర్ :** రోజుకు 30 నిమిషాల మార్నింగ్ వాక్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మొత్తం శ్రేయస్సును మెరుగుపరుస్తుంది. నడక వంటి శారీరక శ్రమ బరువును నియంత్రించడంలో మరియు కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. మీ దినచర్యలో 30 నిమిషాల చురుకైన నడకను జోడించడం వలన మీరు బరువు తగ్గడంతోపాటు ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రెగ్యులర్ వాకింగ్ శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. సాధారణంగా, శారీరక వ్యాయామాలు మరియు కార్యకలాపాలు ఆందోళన, నిరాశ, ఒత్తిడి మరియు ఇతర సమస్యలను నివారించేందుకు సహాయపడతాయని చెబుతారు. మార్నింగ్ వాక్ వల్ల వీటి కంటే ఎక్కువ ప్రయోజనాలను పొందవచ్చు.. ఏంటంటే..

**మెరుగైన శక్తి స్థాయి :**
ఖాళీ కడుపుతో ఉదయం నడక మీ శక్తిని పెంచుతుంది, మీరు రిఫ్రెష్ మరియు శక్తిని పొందేలా చేస్తుంది. నడక వంటి సాధారణ శారీరక శ్రమ మీ శక్తి స్థాయిలను పెంచడానికి గొప్ప మార్గం. ఇది రోజంతా అలసట మరియు ఉత్సాహాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**గుండె ఆరోగ్యాన్ని బలపరుస్తుంది :**
ఉదయాన్నే చురుకైన నడక మీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ సాధారణ వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని మరియు రక్తపోటును తగ్గిస్తుంది. ప్రతిరోజూ ఉదయం వ్యాయామం చేయడం వల్ల మీ స్ట్రోక్ మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందుగానే తగ్గించుకోవచ్చు.

**జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది :**
జీర్ణక్రియను ఉత్తేజపరిచేందుకు ఖాళీ కడుపుతో ఉదయాన్నే నడవడం మంచిది. ఈ అభ్యాసం మీ ఉదర కండరాల సహజ సంకోచాన్ని ప్రోత్సహిస్తుంది. నడకను ఒక సాధారణ అలవాటుగా చేసుకోండి మరియు మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోండి.

**మెరుగైన మానసిక ఆరోగ్యం :**
మెరుగైన ఆత్మగౌరవం, మెరుగైన మానసిక స్థితి మరియు తగ్గిన ఆందోళన సమస్యలతో సహా మీ



మానసిక ఆరోగ్యానికి నడక గొప్ప ప్రయోజనాలను కలిగి ఉంటుంది. శారీరక శ్రమ మీ శరీరం మానసిక స్థితి మరియు ఆత్మగౌరవాన్ని మెరుగుపరిచే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడంలో సహాయపడుతుంది. ఉదయం నడక యొక్క ఈ శారీరక ప్రయోజనాలు మీ రోజువారీ జీవితంలో మీకు చాలా ప్రయోజనం చేకూరుస్తాయి.

**బరువు తగ్గడం**
ఖాళీ కడుపుతో 30 నిమిషాల మార్నింగ్ వాక్ అనే నియమాన్ని అనుసరించండి. రోజంతా శక్తిని పొందండి. ఈ సాధారణ అభ్యాసాన్ని మీ రోజువారీ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా మీరు ఈ అనేక ప్రయోజనాలను సులభంగా పొందవచ్చు.